
ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY ఖమ్మం





పంచాయతీల్లో ప్రత్యేక కసరత్తు

- 31తో ముగుస్తున్న సర్పంచ్‌ల పదవీకాలం
- పెండింగ్ బిల్లుల చెల్లింపుపై సందిగ్ధత..
- ఆందోళనలో గ్రామ ప్రథమ పౌరులు
- రిజర్వేషన్ల మార్పు కోసమే ఎన్నికలు వాయిదా?

ఖమ్మం కలెక్టరేట్/పినపాక, జనవరి 28: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. ప్రస్తుతం ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు లేకపోవడంతో ఫిబ్రవరి 1 నుంచి పంచాయతీల పాలనా బాధ్యతలను ప్రత్యేక అధికారులకు అందించేందుకు రంగం సిద్ధమతుతోంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా నిండకపోవడంతో ప్రభుత్వం ఇంత త్వరగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే ఇటీవల సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ప్రజలోకి వెళ్లింది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందన్న ప్రచారంతో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ఎదుర్కొనేందుకు సమయం తీసుకోవాలని అధికార పార్టీ యోచిస్తోంది. అయితే ఎన్నికల సంఘం మాత్రం ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమై టీ-పోల్ యాప్ ద్వారా సిబ్బంది వివరాలు నమోదు చేసింది. కానీ ప్రభుత్వం నుంచి ఎన్నికల నిర్వహణకు అనుకూల సంకేతాలు రాలేదు. పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం మరో రెండో రోజుల్లు ముగియనుండడంతో వారిస్థానంలో ప్రత్యేకాధికారులను నియమించేందుకు జిల్లాస్థాయిలో అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఖమ్మం జిల్లాలో 589 పంచాయతీలున్నాయి. వీటితో పాటు ఐదు విలీన పంచాయతీలు ఉన్నాయి. వీటికి గతంలో ఎన్నికలను నిర్వహించలేదు. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతోంది. భద్రాద్రి జిల్లాలో 479 పంచాయతీలు ఉండగా ఇక అన్ని పంచాయతీల్లోనూ ఫిబ్రవరి 1నుంచి ప్రత్యేక అధికారుల పాలన సాగనుంది.



రిజర్వేషన్ల మార్పు కోసమే వాయిదా ?

గత ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ కొత్త చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. స్థానిక సంస్థల రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చింది. ప్రజా అవసరాలు తీర్చాలంటే ఒకే సామాజికవర్గానికి రెండు దపాలుగా సర్పంచ్‌గా అవకాశం ఇస్తే స్పష్టమైన అభివృద్ధి సాధ్యమని పేర్కొంది. ఆ చట్టం ప్రకారం ఒక గ్రామంలో పదేళ్ల ఒకే రిజర్వేషన్ అమలులో ఉంటుంది. అయితే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని అమలు చేస్తుందా..? చట్టాన్ని సవరించి 2018కి ముందున్న విధానం వైపు మొగ్గు చూపుతుందా ? అనే విషయం తెలియాల్సి ఉంది. స్థానిక సంస్థల్లో ఇప్పటికే మహిళలకు 50శాతం రిజర్వేషన్లు అమలులో ఉండగా.. మరోవైపు బీసీ కోటా పెంచాలనే డిమాండ్ ఉంది. తాము అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇవ్వడంతో పాటు ప్రస్తుతం కులగణనకు సిద్ధమవుతోంది. దాంతో ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తరువాతనే పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించాలని యోచిస్తోన్నట్లు తెలుస్తోంది.

పంచాయతీ స్థాయిని బట్టి అధికారులకు బాధ్యతలు

పంచాయతీలకుప్రత్యేక అధికారుల నియామకం కోసం ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసి నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం మేజర్ పంచాయతీలకు గెజిటెడ్ అధికారులు, మిగిలిన పంచాయతీలకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీవోలు, వ్యవసాయ విస్తరణాధికారులు, ఎంఈవోలకు బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది.

పెండింగ్ బిల్లులపై ఆందోళనలో సర్పంచ్‌లు

పంచాయతీల్లో 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు స్థానిక ఆర్థిక వనరుల ఆదాయంతో సర్పంచ్‌లు గ్రామాల్లో అభివృద్ధి పనులు నిర్వాహించారు. అయితే నిధుల కొరతతో పాటు కొన్నిచోట్ల ఆలస్యంగా పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో అభివృద్ధి పనులపై సర్పంచ్‌లు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే, మీళ్లీ ప్రజలు అవకాశం ఇవ్వకపోగా నిలదీస్తారన్న భయంతో చాలామంది సర్పంచ్‌లు తమ స్థాయికి మించి అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు నిర్వహించారు. అయితే రాష్ట్రంలో అధికారం మారడంతో పాటు పాత ప్రభుత్వం తమకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులకోసం తాము తెచ్చిన అప్పుల సంగతేంటని సర్పంచ్‌లు ఆందోళనలో ఉన్నారు. ప్రత్యేకాధికారుల నియామకంతో బిల్లుల బకాయిలు చెల్లిస్తారా లేక కొర్రీలు పెడతారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకాధికారులకు పన్ను వసూళ్ల భారం

పంచాయతీల్లో భారీగా పేరుకుపోయిన ఇంటిపన్ను బకాయిలు

ఖమ్మం, జనవరి 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున జిల్లాలో ప్రత్యేక అధికారుల నియాకానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసింది. ఫిబ్రవరి 1నుంచి గ్రామ పాలన ప్రత్యేక అధికారుల చేతిలోకి వెళ్లనుంది. ఇకపై గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనుల అమలు, ఇంటి పన్నుల వసూలు, పంచాయతీల్లో పరిపాలన భారం అంతా స్పెషలాఫీసర్ల కనుసన్నల్లో జరగనుంది. అయితే మార్చిలోగా పంచాయతీ పన్నులు వసూలు చేయాల్సి ఉన్నందున కొత్తగా బాధ్యతలు చేపట్టబోతున్న ప్రత్యేక అధికారులకు ఇంటిపన్నుల వసూళ్ల పెనుభారం కానుంది. ఖమ్మం జిల్లాలో 589పంచాయతీలకు సంబంధించి రూ.16.85కోట్ల ఇంటిపన్ను బకాయిలు వసూలు చేయాల్సి ఉంది. ప్రస్తుత పంచాయతీ పన్నులు రూ.10.73కోట్లు బకాయిలు ఉండగా, పాతబకాయిలు రూ.6.12కోట్ల వరకు ఉన్నాయి. జిల్లాలో ఇంటిపన్నుల వసులులో పంచాయతీలు కాస్త నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నాయి. సర్పంచ్‌కు రాజకీయ ఇబ్బందులతో ఇంటిపన్నులు వసూలు చేయలేని పరిస్థితి ఉంది. అయితే ఇకపై ప్రత్యేక అధికారులు రంగంలోకి దిగుతున్నందున ఇంటిపన్నులపైనే వారు ప్రధాన దృష్టిపెట్టే అవకాశం ఉంది.

ఖమ్మం జిల్లాలో మండలాల వారీగా ఇంటిపన్ను బకాయిలు ఇలా..

మండలం	పంచాయతీలు	బకాయిలు
తల్లాడ	27	రూ.6.20లక్షలు
కూసుమంచి	41	రూ.55.16లక్షలు
కల్లూరు	31	రూ.65.93లక్షలు
రఘునాథపాలెం	40	రూ.62.86లక్షలు
సత్తుపల్లి	21	రూ.58.07లక్షలు
కొణిజర్ల	27	రూ.48.79లక్షలు
వైరా	22	రూ.24.53లక్షలు
చింతకాని	26	రూ.47.06లక్షలు
ఏన్కూరు	25	రూ.42.31లక్షలు
ముదిగొండ	25	రూ.72.31లక్షలు
ఎర్రుపాలెం	31	రూ.43.72లక్షలు
కామేపల్లి	24	రూ.21.85లక్షలు
నేలకొండపల్లి	32	రూ.1.17కోట్లు
బోనకల్	22	రూ.31.39లక్షలు
పెనుబల్లి	33	రూ.55.85లక్షలు
వేంసూరు	26	రూ.57.37లక్షలు
తిరుమలాయపాలెం	40	రూ.54.01లక్షలు
మధిర	27	రూ.79.45లక్షలు
ఖమ్మంరూరల్	28	రూ.6.53కోట్లు
సింగరేణిలో	41	రూ.47.36లక్షలు
	589	రూ.16.85కోట్లు

భక్తాద్రి

- భద్రాద్రి రామాలయంలో భక్తుల సందడి
- రామయ్యను దర్శించుకున్న 36వేల మంది
- మూడు రోజుల్లో దేవస్థానానికి రూ.47,90,673 ఆదాయం

భద్రాచలం, జనవరి 28: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. గత రెండు రోజులుగా భద్రాద్రి పుణ్యక్షేత్రానికి భక్తులు భారీగా తరలిస్తున్నారు.రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయం, ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. గత మూడు రోజులుగా భద్రాద్రి రామయ్యను 36వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ మూడు రోజుల్లో దేవస్థానానికి రూ.47,90,673 ఆదాయం సమకూరింది. స్వామివారికి ఆదివారం నిర్వహించిన మూలవరుల అభిషేకం, నిత్యకల్యాణం తదితర ఆర్జిత సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా వారాంతపు, పండుగ సెలవుల సమయంలో భద్రాద్రి రామాలయానికి భారీగా భక్తులు తరలివస్తుండటంతో ఇక నుంచి అలాంటి ప్రత్యేక రోజుల్లో స్వామివారికి నిర్వహించే నిత్యకల్యాణాన్ని చిత్రకూట మండపంలో నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. దీని వల్ల ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



స్వామి వారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

భద్రాద్రి వారధి సత్వరం పూర్తిచేయాలి

- మట్టి తోలకాన్ని అడ్డుకుంటే పోలీసుల సాయం తీసుకోండి
- రెండో బ్రిడ్జి పనుల నత్తనడకపై మంత్రి తుమ్మల ఆగ్రహం

ఖమ్మం(ఆంధ్రజ్యోతిప్రతినిధి)/ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 28: భద్రాచలం వద్ద గోదావరిపై నిర్మిస్తున్న రెండో వంతెన పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. పనులు నత్తనడకన కొనసాగితే సహించేది లేదన్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులతో భద్రాచలం గోదావరి బ్రిడ్జి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామనవమిని దృష్టిలో ఉంచుకుని నవమి కంటే నెలరోజుల ముందుగానే బ్రిడ్జి పనులు పూర్తికావాలని, అయినా ఇంకా నత్తనడకన నడుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి బ్రిడ్జికి వెళ్లే రహదారి వైపు అప్రోచ్‌కు మట్టి లేదంటే సీతారామకాలవ మట్టి వినియోగించుకోమని సూచించానని, ఆ మట్టితో సంబంధం లేని సర్పంచ్ అడ్డుపడుతున్నాడని మట్టితోలకం పనులు ఆపుతారా ? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా అభివృద్ధి పనులు అడ్డుకుంటే పోలీసుల సహకారం తీసుకుని పనులు నడిపించాలని సూచించారు. పనులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆపవద్దని సూచించారు. వెంటనే భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి తుమ్మల సీతారామ కాలువ మట్టిని గోదావరి బ్రిడ్జి అప్రోచ్ రోడ్డుకు వెళ్లేలా చూడాలని, ఎవరైనా అడ్డుకుంటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



రెండోవారధి నిర్మాణ పనులపై అధికారులకు సూచనలిస్తున్న మంత్రి తుమ్మల (ఫైల్)

నేడు ఇరు జిల్లాల్లో మంత్రి తుమ్మల పర్యటన

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఇరు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఖమ్మం నుంచి ఉదయం 7గంటలకు అశ్వారావుపేట చేరకుంటారు. అక్కడ అయిల్‌పామ్‌తోటను మంత్రి పరిశీలించనున్నారు. తర్వాత దమ్మపేట మండలంలోని అప్పారావుపేట, సత్తుపల్లి మండలంలోని బుగ్గపాడులో మంత్రి పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

సర్కార్ దవాఖానాల్లో

ఔషధాల కరువు

- తీవ్రంగా మందు బిళ్లల కొరత.. నామమాత్రంగానే సిరంజీలు లభ్యం
- నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి
- ప్రైవేటులో కొనుగోలు చేస్తున్న పేద రోగులు

సర్కార్ దవాఖానాలను సమూలంగా ప్రక్షాళన చేశామని, అన్ని వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా గ్రామీణ ఆసుపత్రుల్లో ఔషధాలు లేక, ప్రజలకు వైద్య సేవలు అందించలేకపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యంతో పాటు మందులన్నీ ఉచితంగా అందుతాయని ఆశపడి వచ్చిన పేదలకు భంగపాటు తప్పడం లేదు. భద్రాద్రి జిల్లాలో ఆరు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లు, 31 పీహెచ్‌సీలతో పాటు, 153 అర్బన్‌హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. అయితే ఆయా సెంటర్లలో మందుల నిల్వాలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జూలూరుపాడు, జనవరి 28: గత కొన్ని నెలలుగా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. జ్వర పీడితులకు ఇవ్వడానికి పారాసెట్మాల్-500 ఎంజి మందు బిల్లలు అందుబాటులో లేవు. 650 ఎంజీ మాత్రలు మాత్రమే ఉన్నాయి. వీటిని రోగులు వేసుకుంటే కొన్నిసార్లు అనార్థాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో వాతావరణ పరిస్థితులు మారడంతో ప్రజలు జలుబు, దగ్గులతో బాధపడుతున్నారు. రోగులకు ఇవ్వడానికి సిట్రజన్, ఎమ్రాగ్జిల్ సిరప్‌లు వంటివి కూడా అందుబాటులో లేవు. గ్యాస్ సమస్యలతో బాధపడే రోగులకు అందించడానికి పాంటాప్, ర్యాంటాప్‌లతో పాటు, నొప్పులకు సంబంధించిన డైక్లోఫినాక్ మందు బిల్లలు లేవు. వీటితో పాటు పలు రకాల యాంటీబయాటిక్ మందు బిల్లలు లభించకపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక చాలా ఆసుపత్రుల్లో సిరంజ్‌లు కూడా నామమాత్రంగానే లభిస్తున్నాయి. ఇవి కూడా కొరతగా ఉండడంతో గత కొన్ని రోజుల క్రితం జూలూరుపాడు ప్రభుత్వ వైద్య సిబ్బంది కొంతమంది దాతలకు సమస్యలను తెలియజేసి వాటిని కొనుగోలు చేశారు.



జూలూరుపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నాలుగు నెలలుగా నిలిచిన సరఫరా..

సర్కార్ ఆసుపత్రులకు డ్రగ్స్‌ను సరఫరా చేసే ఏజెన్సీలకు ప్రభుత్వం గత కొన్ని నెలలుగా బకాయిలు చెల్లించలేదు. దీంతో ఏజెన్సీల నిర్వాహకులు తాము మందులను సరఫరా చేయలేమని చేతులెత్తేశాయి. ఈ కారణంగానే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔషధాల కొరత ఏర్పడిందని వైద్య సిబ్బంది చెబుతున్నారు. తాము మందుల కోసం ఇండెంట్ పెట్టినా గోదాంలలో కొన్ని రకాలకు సంబంధించిన మందు బిల్లలు అందుబాటులో లేకపోవడంతో వారు కూడా ఆసుపత్రులకు అందించలేకపోతున్నారు. నాలుగు నెలలుగా కొన్ని రకాల యాంటీబయాటిక్, గ్యాస్, జలుబు, దగ్గు, నొప్పులకు సంబంధించిన మందు బిల్లలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభించడం లేదు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేదలకు తిప్పలు తప్పడం లేదు. ఇంకా ఎన్నాళ్ల ప్రవేటు దుకాణాల్లో మందులను కొనుగోలు చేయాల్సి వస్తుందో నని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ ఆసుపత్రులకు మందు బిల్లలను పంపిణీ చేసి తమ ఇబ్బందులను తొలిగించాలని కోరుతున్నారు.

పైనుంచే సరఫరా లేదు

రాకేష్, ప్రభుత్వ వైద్యాధికారి, జూలూరుపాడు



కొన్ని రకాల ఔషధాలు పైనుంచే సరఫరా చేయకపోవడంతో రోగులకు అందించలేకపోతున్నాం. తాము ఇండెంట్ పెట్టినా ఖమ్మంలోని డ్రగ్స్ పాయింట్‌లో నిల్వాలు లేకపోవడంతో వారు అందించలేకపోతున్నారు. ప్రభుత్వం నుంచి సరఫరా కావడం లేదు. ఇది రోగులకు అసౌకర్యం కలిగిస్తున్నా తాము ఏం చేయలేకపోతున్నాం. పది రోజుల్లో అన్ని రకాల మందు బిల్లలను ప్రభుత్వ ఆసుపత్రిల్లో అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

మరుగున

పడుతున్నాయ్!

- అంగన్‌వాడీల్లో నత్తనడకన టాయిలెట్ల నిర్మాణం
- చాలాచోట్ల అసంపూర్తిగా నిర్మాణాలు
- విద్యుత్, తాగునీరు లేక ఇబ్బందుల్లో మహిళలు, చిన్నారులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 28: గ్రామీణ ప్రాంతాల్లో రోగాలకు కారణమవుతున్న బహిరంగ మలవిసర్జనను రూపుమాపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ (ఉపాధి హామీ)లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ప్రారంభించింది. అందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాలలో మహిళలు, చిన్నారుల కోసం టాయిటెట్లను మంజూరు చేసింది. అయితే మంజూరైన ఆ నిర్మాణాలలో ఇంకా సగం పూర్తి కావాల్సి ఉంది. ఇంజినీరింగ్ అధికారుల నిర్వాకం, శాఖల మధ్య సమన్వయలోపం కారణంగా ప్రతిష్టాత్మకంగా భావించిన ఈ పథకాలు నీరుగారిపోతున్నాయి. జిల్లాలో 17మండలాల్లో మొత్తం 114 టాయిలెట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 113 టాయిలెట్ల నిర్మాణాలను ప్రారంభించారు. అయితే వాటిలో 64 పూర్తి కాగా ఇంకా 50 వివిధ దశల్లో ఉన్నాయి. ఒకచోట ఇంకా ప్రారంభించలేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు కనీసం బాత్‌రూం సౌకర్యం కూడా అందుబాటులో లేదు. కేంద్రాల్లో మరుగుదొడ్లు లేక బాలింతలు, గర్భిణులు మళ్లీ ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయాన్ని ఎవరికి చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారు. చిన్నారులు బాత్‌రూంకు వెళితే కేంద్ర బయటకు తీసుకు వచ్చి శుభ్రం చేస్తున్నారు. కాగా ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కువ శాతం కేంద్రాలలో విద్యుత్, తాగునీరు లేకపోవటంతో మహిళలు, చిన్నారుల, అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండాకాలంలో కరెంట్ లేని కేంద్రాలకు తీవ్రవేడి గాలుల కారణంగా లబ్ధిదారులు సెంటర్‌లకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం కరెంట్, తాగునీరు, మూత్రశాలలు లేని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలను సేకరించి నెలలు గడుస్తున్నా ప్రయోజనం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.



విద్యుత్ సౌకర్యం, మూత్రశాలలు లేని అంగన్‌వాడీ కేంద్రం

50 కేంద్రాల్లో నత్తనడకన..

జిల్లాలో 50అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. కూసుమంచి మండలంలోని బోడ తండా కేంద్రంలో ఇంకా నిర్మాణం ప్రారంభించలేదు. పునాది పనులు దాటిన కేంద్రాలు 12 ఉండగా, ఏడు కేంద్రాలలో బేస్‌మెంట్‌లను నిర్మించారు. 30అంగన్‌వాడీల్లో కప్పు వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. మొత్తం 64 కేంద్రాలలో నిర్మాణాలు పూర్తిచేశారు. బోనకల్, చింతకాని, నేలకొండపల్లి, ఎర్రుపాలెం మండలాలలో మంజూరైన 17 మరుగుదొడ్లను సకాలంలో పూర్తిచేశారు. వేంసూరు మండలంలో 12టాయిటెట్లు మంజూరు కాగా 9నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కేవలం మూడు మాత్రమే పూర్తయ్యాయి. సింగరేణి మండలంలో 16 మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించగా ఏడు మాత్రమే పూర్తయ్యాయి. మధిర మండలంలో 10 టాయిలెట్లకు గాను సగం పూర్తయ్యాయి. ఇక లబ్ధిదారులకు వసతుల కల్పనలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం నిధులివ్వనుండగా.. మరుగుదొడ్ల నిర్వహణ ఇతరత్రా కార్యక్రమాలకు అవసరమయ్యే వాడుక నీటికి సంబంధించిన ఏర్పాట్లు మాత్రం స్థానిక పాలకులు చూడాలని సూచించింది. మరుగుదొడ్లు, తాగునీటి వసతులను ఒకే కార్యాచరణ ప్రణాళికలో రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తే విడతల వారీగా కేంద్రం నిధులు విడుదల చేస్తోంది.

ఎక్కడికక్కడే బ్రేక్



- సత్తుపల్లి మునిసిపాలిటీలో నిలిచిన అభివృద్ధి పనులు
- ఆపాలని ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు
- ప్రశ్నార్థకంగా రూ.90 కోట్ల అభివృద్ధి పనుల భవితవ్యం

పిల్లర్స్ దశలో పనులు ఆగిన అంబేద్కర్ ఆడిటోరియం





క్రిస్టియన్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన శిలాఫలకం, నిలిచిపోయిన దోబీఘాట్ పనులు

సత్తుపల్లి, జనవరి 28: సత్తుపల్లి మునిసిపాలిటీలోని 23 వార్డుల పరిధిలో మంజూరైన పలు అభివృద్ధి పనులు కొద్దిరోజులుగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సత్తుపల్లి పట్టణంలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్), స్పెషల్ గ్రాంట్, డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్), తదితర గ్రాంట్‌ల నుంచి మంజూరైన పనులను ఎక్కడికక్కడ నిలిపి వేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. స్థానిక అధికారులకు ఈ మేరకు ఆదేశాలు అందడంతో పనులను కొద్దిరోజులుగా నిలిపివే శారు.

వివిధ పనులకు మంజూరైన నిధులిలా..

సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గానూ టీయూ ఎఫ్ఐడీసీ కింద రూ.26కోట్లు మంజూరు చేస్తున్నట్లు గత ప్రభుత్వంలో మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. తరువాత ఇదే గ్రాంట్ మరో రూ.5 కోట్లు గత ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా సత్తుపల్లి మునిసిపాలిటీ అభివృద్ధికి గానూ స్పెషల్ గ్రాంట్ రూ.30 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా రూ.61కోట్లకు సంబంధించి ఉత్తర్వులు విడుదల అయ్యాయి. వీటితో పాటు డీఎంఎఫ్‌టీ నిధులు ఒక విడత రూ.7.20కోట్లు, మరో విడత రూ.20 కోట్లు సత్తుపల్లి మునిసిపాలిటీకి మంజూరయ్యాయి. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.34లక్షలు, ఎంపీ నిధుల నుంచి మరో రూ.20లక్షలు అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరు చేశారు. టీయూ ఎఫ్ఐడీసీ, ముఖ్యమంత్రి స్పెషల్ గ్రాంట్ నుంచి మంజూరైన రూ.61కోట్లలో మునిసిపల్ అధికారులు రూ.51 కోట్లకు టెండర్లు పిలిచారు. వీటిలో కొన్ని పనులు ప్రారంభమ య్యాయి. కొన్ని అగ్రిమెంట్ దశలోనూ, మరికొన్ని టెక్నికల్ శాంక్షన్ దశలో, మరికొన్ని టెండర్లు పిలవాల్సిన దశ లో ఉన్నాయి. డీఎంఎఫ్‌టీ నిధులకు సంబంధించి రూ.27.20 కోట్లకు సంబంధించి రూ.15కోట్ల విలువైన పనులకు టెండర్లు సిద్ధం చేశారు. రూ.2.20 కోట్లకు సంబంధించి పను లు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే గ్రాంట్ రూ.34లక్షలలో రూ.25 లక్షల మేర పనులు పూర్తికాగా ఎంపీ గ్రాంట్ మంజూరైన రూ.20లక్షలకు సంబంధించి టెండర్ల దశలో ఉన్నాయి. ఎంపీ, ఎమ్మెల్యే గ్రాంట్‌లకు సంబంధించిన పనులు మినహా మిగిలిన గ్రాంట్‌లతో మంజూరైన పనులను ఎక్కడికక్కడే నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది.

ప్రశ్నార్థకంగా మారిన పనులు

రూ.2.65కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అంబేద్కర్ ఆడిటోరియం, లైబ్రరీ పనులు పిల్లర్స్ నిర్మాణం చేపట్టే దశ లో నిలిపిపోయింది. రూ.70లక్షలతో చేపట్టిన దోబీఘాట్‌లోని మోడ్రన్ లాండ్రీ మార్ట్‌కు సంబంధించిన పనులు సగంలో నిలిచిపోయాయి. రూ.1.30కోట్ల అంచనాతో చేపట్టిన వివేకానంద సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవనం స్లాబ్ పూర్తికాగా గాంధీ నగర్ కమ్యూనిటీ హాల్ ఎర్త్‌వర్క్ జరుగుతోంది. డంప్‌యార్డ్ పనికి సంబంధించి టెండర్ పూర్తయినా పనులు మొదలు కాలేదు. రూ.2కోట్ల అంచనాతో చేపట్టాల్సిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పెండింగ్‌లో పడగా, రూ.3.19కోట్ల అంచనాతో చేపట్టిన స్టోమ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం పూర్తయింది. రూ.2కోట్ల అంచనాతో శంకుస్థాపన జరిగిన షాదీఖానా పనులు, రూ.కోటి అంచనాతో క్రిస్టియన్ భవనం, రూ.5.50కోట్ల అంచనాతో రింగ్ సెంటర్ నుంచి ఎన్టీఆర్ నగర్ బస్టాండ్ వరకు రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన జరగగా ఆ పనులు కూడా నిలిచిపోయాయి. రూ.11.41కోట్ల అంచనాతో 23వార్డులలో సీసీ డ్రైన్లు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం తదితర 224 పనులు ప్రారంభమయ్యాయి. వీటిలో కొన్ని పూర్తికాగా కొన్ని నిలిచిపోయాయి. రూ.5 కోట్ల అంచనాతో చేపట్టాల్సిన వేశ్యకాంతల చెరువు సుందరీకరణకు టెక్నికల్ శాంక్షన్ రావాల్సి ఉండగా తామర చెరువు పార్క్ అభివృద్ధి, వేశ్యకాంతల చెరువు కట్ట అభివృద్ధి పనులు కొనసాగుతున్న క్రమంలో అధికారుల ఆదేశాలతో నిలిచిపోయాయి. టెండర్లు జరిగిన పనులు అగ్రిమెంట్ దశలో కొన్ని ఉండగా సాంకేతిక అనుమతి పనులు కొన్ని రావాల్సి ఉన్నాయి. కొన్ని పనులకు ఇంకా టెండర్లు పిలవాల్సి ఉంది. మొత్తంగా పనులను నిలిపివేయాలంటూ మౌఖిక ఆదేశాలు అందడంతో అవి ముందుకు సాగుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన టీయూఎఫ్ఐడీసీ, ముఖ్యమంత్రి స్పెషల్ గ్రాంట్ ఫండ్స్ తిరిగి మంజూరవుతాయా?, లేదా? అనేది తెలియాల్సి ఉంది.

చూపులేకుంటేనేం.. ముందుచూపుంది!

400 మొబైల్ నంబర్లు కంఠోపాఠం .. మొబైల్ రీచార్జ్‌లతో ఉపాధి.. ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి

ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూపులు .. ఇదీ చెన్నూరుకు చెందిన అంధుడు నాగరాజు గాథ



నాగరాజు

కల్లూరు, జనవరి 26: అతడు పుట్టుకతోనే అంధుడు. జ్ఞాపకశక్తి మెండు. ప్రాథమిక విద్య ప్రభుత్వ పాఠశాలలో పూర్త చేశాడు. ఆ తరువాత ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సహకారంతో ఓపెన్‌లో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పూర్తి చేశాడు. చూపులేకపోయినప్పటికీ ముందుచూపుతో తన పనులు తానే చేసుకుంటాడు. స్వగ్రామం కాకుండా ఇతర గ్రామాలకు వెళ్లినప్పుడు మాత్రమే ఇతరుల సహకారాలు తీసు కుంటాడు. అంతేకాదు తన ఉపాధి నిమిత్తం సెల్ ఫోన్ రీ-చార్జ్‌లు చేస్తాడు. అంతే కాదు ఏకంగా 400 సెల్‌ఫోన్ నంబర్లను గుర్తు పెట్టుకుని టకాటకా చెప్పేయగలడు.

కల్లూరు మండలంలోని చెన్నూరు పంచాయతీ రావికంపాడుకు చెందిన వల్లెబోయిన నాగరాజు పుట్టుకతోనే అంధుడు. పేద కుటుంబంలో జన్మించిన నాగరాజు తల్లిదండ్రులు భాస్కరరావు లక్ష్మీ. కాగా, వీరు కూలిపనుల చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. భాస్కరరావు దంపతులకు నాగరాజు, శ్రావణి సంతానం ఉన్నారు. శ్రావణికి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. అంధుడైనప్పటికీ నాగరాజు డిగ్రీ వరకు చదివాడు. ప్రభుత్వం తరపున ఆయనకు నెల నెలా రూ. 4,016 అందుతుంది. అంధు డైనప్పటికీ తల్లిదండ్రులకు భారం కావొద్దనే ఉద్దేశంతో ఎనిమిదేళ్ల క్రితం నుంచి చెన్నూరు, రావికంపాడులలో పరిచయస్తు లకు సంబంధిం చి మొబైల్ ఫోన్లు, డీటీహెచ్ రీచార్జ్ చే స్తాడు. కమీషన్‌గా రూ. 2 వేలు వరకు ఆదాయం పొందుతున్నాడు. ప్రభు త్వం ఇచ్చే నాలుగువేలు, కమీష న్‌గా వచ్చే రెండు వేలు మొత్తం ఆరు వేలను సంపాది స్తున్నాడు.

ఏకసంథాగ్రాహి

నాగరాజు తన మొబైల్ ఫోన్‌లో ఫీడ్ చేసిన నెంబర్లే కాకుండా తన మదిలో గల నెంబర్లను కూడా ఎవరైన అవలీలగా చెప్పగలడు. ఒక సారి అవతల వ్యక్తి తన మొబైల్ నెంబర్‌ను చెప్తే తిరిగి వెంటనే చెప్పేయగలడు. అంబేద్కర్ యూనివర్సిటీలో ఓపెన్‌లో గత ఏడాది డిగ్రీ పూర్తి చేసిన నాగరాజు ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాడు.

ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి క్రీడలకు సిరిపురం బాలిక



సాయిలిఖిత

వైరా, జనవరి 28: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు ఖమ్మంజిల్లా వైరా మండలంలోని సిరి పురం(కేజీ) గ్రామానికి చెందిన ఐనాల సాయిలిఖిత ఎంపికైంది. ఐనాల సైదులు కుమార్తె అయిన సాయిలిఖిత జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు ఆదివారం టీంతో కలిసి వెళ్లింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో మూడురోజులపాటు జరుగనున్న జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం జట్టులో సాయిలిఖిత ప్రాతినిధ్యం వహిస్తుంది. అండర్-19బాలికల సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 12నుంచి 14వతేదీ వరకు మూడు రోజులపాటు సిద్దిపేటలో జరిగాయి. ప్రతిభ కనపర్చిన సాయిలిఖిత జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. బాలిక ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల సెంట్రాఫ్ ఎక్సలెన్సీ గౌలిదొడ్డిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. జాతీయస్థాయి జట్టుకు ఎంపికైన సాయిలిఖితను సిరిపురం గ్రామస్థులు అభినందించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

వైరా, జనవరి28: వైరాలో ప్రగతి విద్యాల యం (ప్రస్తుతం మూతపడింది) పూర్వవిద్యార్థుల సమ్మేళ నం ఆదివారం ఖమ్మంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఉమ్మడి జిల్లా, వరంగల్‌కు చెందిన 1994-95సంవత్సరానికి చెందిన పదోతరగతి బ్యాచ్ పూర్వవిద్యా ర్థులంతా ఒకచోట చేరి సమ్మేళనాన్ని జరుపుకున్నారు. 30ఏళ్లనాటి సంఘటనలను గుర్తు చేసుకొని ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. నాటి ఉపాధ్యా యులు వెల్లంపల్లి వెంకటరామనర్సయ్య, జాలాది భద్రయ్య, దామా వెంకటేశ్వర్లును సన్మానించారు. పూర్వవిద్యార్థులు, నల్లమోతు రామారావు, పాటి నాగబాబు, జొన్నలగడ్డ మన్మథరావు, బొంతు మాధవరావు, దేవరపు రామకృష్ణ, సునీల్, పాటి. నాగబాబు, దామా. నారాయణరావు, రాయల సురేష్, బషీర్, సీత, మాధురి, జ్యోతి పాల్గొన్నారు.

ఒక్కో కౌన్సిలర్‌కు రూ. 25 లక్షల ఆఫర్

- అవిశ్వాసాన్ని సవాల్‌గా తీసుకున్న కాంగ్రెస్
- ఇప్పటికే వైస్ చైర్మన్‌తో మంత్రి పొంగులేటి చర్చలు
- కొంతమంది కౌన్సిలర్లతో ఎమ్మెల్యే కనకయ్య సంప్రదింపులు
- భారీగా నజరానాలు ప్రకటించినట్టు ప్రచారం
- ఇల్లెందు పురపాలకంలో రోజుకో తీరుగా రాజకీయం



ఇల్లెందుటౌన్, జనవరి 28: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావుపై అవిశ్వాసం ప్రకటించిన అసమ్మతి కౌన్సిలర్లకు భారీగా నజరానా ప్రకటించినట్లుగా జోరుగా ప్రచారాలు సాగుతున్నాయి. ఒక్కో కౌన్సిలర్‌కు రూ.25 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదిరినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన 19 మం ది కౌన్సిలర్లు శిబిరానికి వెళ్లినట్లు తెలిస్తున్నది. మున్సిపల్ చైర్మన్‌పై గత ఏడాదిగా అసమ్మతి రగులుతోంది. 24 మంది సభ్యులు ఉన్న పాలకవర్గంలో మెజార్టీ సభ్యులు కలెక్టర్‌కు నోటీసు అందజేశారు. అవిశ్వాస సమావేశాన్ని వచ్చే నెల 5న నిర్వ హించేందుకు ప్రకటించడంతో మునిసిపాలిటీలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. అవి శ్వాసం నోటీసులు అందుకున్న రోజు రాత్రే సుమారు 15 మంది కౌన్సి లర్లు శిబిరానికి తరలిపోవడం చర్చనీయాంశంగా మారింది. అసమ్మతి కౌన్సిల ర్లు అంతా హైదారాబాద్ అనంతరం గోవాకు తరలి పోయినట్లుగా ప్రచారం సాగుతున్నది. ఐదు సంవత్సరాల పదవీకాలం ముగింపు దశలో ఉండగా తమకు బంపర్ ఆఫర్ రావడంతో కౌన్సిలర్లు సంబరపడకుంటూ శిబిరానికి తరివెళ్లారని ప్రచారం జరుగుతోంది.

రంగంలోకి కాంగ్రెస్ పెద్దలు

దమ్మాలపాటి వెంకటేశ్వరావుకు పై బీఆర్ఎస్, సీపీఐ, ఎన్డీ కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానం పెట్టడంతో దాని నుంచి గట్టెక్కేందుకు కాంగ్రెస్‌కు చెందిన పెద్దలు రంగంలోకి దిగినట్లుగా సమాచారం. ఇప్పటికే రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అవిశ్వాసం ప్రకటించిన వైస్ చైర్మన్ జానీ, దానికి సహకరిస్తున్న ప్రముఖ వ్యాపారితో చర్చలు జరిపారు. అనం తరం ఎమ్మెల్యే కోరం కనకయ్య సైతం కొంతమంది అవిశ్వాస కౌన్సిలర్లతో సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. రా ష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్, ఇద్దరు ఇతర పార్టీల కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించడంపై కాం గ్రెస్ పెద్దలు సవాల్‌గా భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇద్దరు మంత్రులు, ఒక ఉప ముఖ్యమంత్రి పాతినిధ్యం వహి స్తున్న నేపథ్యంలో తమ పార్టీ చైర్మన్‌పైనే అవిశ్వాసం పెట్టడంపై సీరియస్‌గానే సమాలోచనలు చేస్తున్నట్టుగా తెలు స్తోంది. ఎలాగైనా అవిశ్వాసం నుంచి గట్టెక్కించేందుకు పలు రకాలుగా ప్రణాళికలు రూపొందించి, కొంత మంది పెద్దల ను రంగంలోనికి దించినట్లు సమాచారం. అసమ్మతి కౌన్సిలర్లు చేస్తున్న శిబిర రాజకీయలను తిప్పికొట్టాలనే యోచనలో కాంగ్రెస్ పెద్దలు నిమగ్నమైనట్టు సమాచారం. అయితే ఈ పరిణామాలతో ఇల్లెందు పురపాలకంలో రాజకీయం ఏ క్షణంలో ఏ మలుపు తిరుగుతుందోననే ఆందోళన అటు అ ధికారులు ఇటు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం గా మారింది.

ఇల్లెందు మునిసిపల్ కౌన్సిలర్, ఆమె కుమారుడిపై

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఇల్లెందుటౌన్, జనవరి 28: ఇల్లెందు మున్సిపల్ కౌన్సిలర్, ఆమె కుమారుడిపై పోలీసులు ఆదివారం రాత్రి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఈ నెల 4న 13వ వార్డులో జరిగిన ప్రజాపాలనలో కౌన్సిలర్ కడకంటి పద్మా, ఆమె కుమారుడు వీరస్వామి అదే వార్డుకు చెందిన బొల్లి రాజు అనే ఆదివాసీ యువకుడిని కులం పేరుతో దూషించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అనంతరం బొల్లి రాజు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడేందుకు ప్రయత్నించగా కౌన్సిలర్, ఆమె కుమారుడు నిర్లక్ష్యంగా వ్యవ హరించారు. ఈనేపథ్యంలో ఆదివారం ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొల్లి రాజు ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దర్యాప్తు చేపట్టారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



ప్రమీల(ఫైల్)

అశ్వారావుపేట, జనవరి 28: అనుమానాస్పదస్థితిలో ఓ వివాహిత మృత చెందింది. ఈసంఘటన అశ్వారావుపేట మండలం, బచ్చువారిగూడెంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన తెల్లం ప్రమీల (23) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతురాలికి ఏడాది వయసున్న బాబు ఉన్నాడు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చువారి గూడేనికి చెందిన తెల్లం హరిబాబు, ప్రమీలను మూడేళ్ల క్రితం ప్రేమించి వివాహమాడాడు. వీరికి ఒక సంవత్సరం బాబు ఉన్నాడు. శని వారం భార్యాభర్తలు శనివారం వారి గదిలో నిద్రించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో ప్రమీల (23) అదే గదిలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించి విచారణ చేపట్టామని, పూ ర్తి వివరాలు తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు. అయితే భర్తపై అనుమానంతో తరుచూ ప్రమీల గొడవపడుతుంటుందని తెలిసిందని, ఆ దిశగా విచారణ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రమీల తండ్రి కాకా విజయ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు: ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

దమ్మపేట/ జూలూరుపాడు/ ఆళ్లపల్లి, జనవరి 28: భద్రాద్రి జిల్లాలో ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్గపాడు గ్రామానికి చెందిన సవలం రాము (18) మరో వ్యక్తి తుర్సం ఏసుబాబుతో కలసి పనిమీద ద్విచక్రవాహనంపై నాగుపల్లి వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో నాగుపల్లి గ్రామ సమీపంలో సత్తుపల్లి వైపు వేగంగా వెళుతున్న లారీ వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది ఈఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే గ్రామస్తులు అంబులెన్స్‌లో సత్తుపల్లి తీసుకు వెళ్లగా రాము మృతిచెందిన నట్లు డాక్టర్లు తెలిపారు. తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై సాయికిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడిన సారయ్య

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన ఆదివారం ఆళ్లపల్లి మం డలంలో జరిగింది. ఆళ్లపల్లి మండలం, ముత్తాపురం గ్రా మానికి చెందిన పు సం సారయ్య ఆదివారం స్వగ్రామం నుంచి కాచనపల్లి వెళ్లి అక్కడ చేపలు తీసుకొని తిరిగి స్వగ్రామం వస్తున్నాడు. ఈ క్రమంలో సారయ్య అనంతో గు- కాచనపల్లి మధ్య అడవి లో బైక్ అదుపుతప్పి రెండు చెట్ల మధ్యలో నుంచి దూసు కెళ్లి గోతిలో పడింది. ఈప్రమా దంలో అతడికి తీవ్ర గా యాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచా రం ఇవ్వడంతో వారు వచ్చి క్షతగాత్రుడిని ఆసుపత్రికి తీసు కెళ్లారు.

వినోభానగర్‌లో..

జూలూరుపాడు మండలంలోని వినోభా నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే రాంచంద్రాపురానికి చెందిన తాటి కన్నయ్య అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై గార్లఒడ్డు నుంచి జూలూరుపా డు వైపుకు వస్తున్నారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కొత్త గూడెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదే సమ యంలో రా వడంతో అది తగులుతుందని భయపడి కన్న య్య ద్విచ క్రవాహనాన్ని రోడ్డు క్రిందకు దించుతున్న క్ర మంలో కింద పడిపోయింది. ఈ సంఘటనలో అతనికి తీ వ్ర గాయాలు కాగా 108 వాహనంలో జూలూరుపాడు ప్రభుత్వ ఆసుప త్రికి తరలించి ప్రాథమిక వైద్య సేవలను అందించి అదే వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

భర్తపై కేసు నమోదు

దమ్మపేట, జనవరి 28: భార్యను అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్న భర్త, ఇతర వ్యక్తులపై దమ్మపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం దురదపాడుకు చెందిన గణప రామకృష్ణకు దమ్మపేట మండలం లచ్చాపురానికి చెందిన సౌజన్యతో నాలుగు సంవత్సరాల కితం వివాహం జరిగింది. వివాహాన్ని కూడా సౌజన్య తల్లిదండ్రులు ఘనంగా నిర్వహించారు. పెళ్లి సమయంలో సౌజన్య కుటుంబసభ్యులు భారీగా కట్న కానుకలు అందజేశారు. అయినప్పటికీ అదనపు కట్నం కావాలంటూ భర్త రామకృష్ణ కుటుంబ సభ్యులు సౌజన్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. వారు పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక ఆదివారం సౌజన్య దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఎస్సై సాయి కిషోర్ రెడ్డి రామకృష్ణతో పాటు కుటుంబ సభ్యులపై కేసు మోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మూడు ఇళ్లల్లో దొంగతనం

15 తులాల బంగారం, 68 వేల నగదు చోరీ

ఖమ్మం క్రైం జనవరి 28: నగరంలోని కవిరాజ్‌నగర్ రోడ్ నెంబర్ 9లో శనివారం అర్ధరాత్రి మూడు ఇండ్లలో చోరీ జరిగింది. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న మిరియాల రంగయ్య అనే వ్యాపారి తన ఇంట్లో నిద్రిస్తుండగా దొంగలు వచ్చి ఇంటిలోని 15 తులాల బంగారం, రూ.68 వేల నగదు చోరీ చేశారు. అదేవిధంగా వాటి ఇంటి ఎదురుగా నివసించే సత్యనారాయణ అను వ్యక్తి నివాసంలో కూడా దొంగలు వెళ్లి చోరీకి యత్నించగా ఇంట్లో ఎలాంటి నగదు లభించకపో వటంతో అక్కడి నుంచి వెళ్లి సమీపంలోని ఎం.సురేష్ ఇంటిలో యత్నించారు. అక్కడ కొంత నగదు మాత్రమే దొరకడంతో అవి తీసుకుని వెళ్లిపోయారు. తెల్లవారిన తర్వాత గుర్తించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు సంఘటనాస్థలం వద్దకు చేరుకొని క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

చోరీ కేసు నమోదు

ఖమ్మంరూరల్, జనవరి 28: మండల పరిధిలోని కామంచికల్లు గ్రామానికి చెందిన రవికిషోర్‌రెడ్డి ఈనెల 20న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా హైదరాబాద్ వెల్లారు. 26న తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపు తీసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లోని సుమారు రూ.89 వేల విలువ గల 44.5 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిసింది. గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత

దమ్మపేట, జనవరి 28 : దమ్మపేటలో శనివారం అర్ధరాత్రి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈవిషయం పై ఎస్సై సాయికిషోర్‌రెడ్డిని వివరణ కోరగా అర్ధరాత్రి కొందరు మట్టితోలు తున్నట్లు 108కి సమాచారం ఇచ్చారని, సమాచారం మేరకు నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కి తరలించినట్లు తెలిపారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేయనున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్రమంగా మట్టి తవ్వితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనింగ్ నుంచి అనుమతులు, రెవెన్యూ నిబంధనలు పాటిస్తేనే మట్టి తవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇష్టానుసారంగా మట్టి తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

42 కిలోల గంజాయి స్వాధీనం

మణుగూరు, జనవరి 28 : మణుగూరు మండలంలోని తోగ్గూడెం గ్రామంలోని సమ్మక్క సారక్క గుడి వద్ద ఆదివారం ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్, మణుగూరు ఎక్సైజ్ అధికారులు సంయుక్తగా నిర్వహించిన వాహన తనిఖీల్లో ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న 42 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి మణుగూరు సీఐ రాంమ్మూర్తి తెలిపారు. తమకున్న విశ్వసనీయమైన సమాచారం ప్రకారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారులో మణుగూరు నంచి హైదరాబాద్‌కు తలరించేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారన్నారు. తమ సిబ్బంది వారిని పట్టుకున్నారని తెలిపారు గంజాయి విలువ దాదాపు 13 లక్షలు ఉంటుందని తెలిపారు. అక్రమంగా గంజాయి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రధాని మోదీతో పరీక్ష పే చర్చకు

గుండాల విద్యార్థి



సుమశ్రీ

గుండాల, జనవరి 28: ప్రధాని నరేంద్ర మోదీతో సోమవారం నిర్వహించే పరీక్షా పే చర్చకు గుండాల మండల విద్యార్థిని ఎంపికైంది. ఇల్లెందు మండ లం, నెహ్రూనగరానికి చెందిన వి. సుమశ్రీ గుండాల మండలంలోని ఏకల వ్య పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నది. పరీక్ష పే చర్చకు రా ష్ట్రంలో 23 ఏకలవ్య పాఠశాలల్లోని 10 మంది విద్యార్థులను ఎంపిక చేయగా అం దులో సుమశ్రీ ఒకరు. విద్యార్థుల్లో పరీక్షలంటే భయం పోగొట్టేందుకు ప్రధానమంత్రి పరీక్ష పే చర్చ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులను ఎంపిక చేసుకుని వారితో సంభాషిస్తారు. కాగా, సుమశ్రీని ప్రిన్సిపల్ సంధ్యారాణి, ఈఎంఆర్ఎస్ సెక్రటరీ నవీన్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రజిత అభినందించారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

సత్తుపల్లిరూరల్, జనవరి28: సత్తుపల్లి మండలంలో కోడిపందేల స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. మండలంలోని సదాశివునిపేట-తుంబూరు గ్రామాల మధ్య తోటలో అనుమతులు లేకుండా కోడిపందేలు ఆడుతున్న సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకున్నారు. దాడిలో 2పందెంకోళ్లు, రూ.2వేల నగదుతో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కుశకుమార్ తెలిపారు.

మహిళకు పాముకాటు

నేలకొండపల్లి, జనవరి 28: మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన అంగడాల నాగమణి పాముకాటుకు గురైంది. వివరాల ప్రకారం నాగమణి ప్రతిరోజూలాగానే ఆదివారం సైతం గేదెలను మేపటానికి తోలుకెళ్ళింది. ఈక్రమంలో మధ్యాహ్నం నాగమణిని పాము కరిచిందని సమాచారం. నాగమణిని వైద్యం కోసం వెంటనే ఖమ్మంలోని ఓప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం నాగమణి చికిత్స పొందుతున్నది. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. వైద్యులు ఆమెకు అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నారు.

తూకాల్లో మోసానికి పాల్పడితే

కఠిన చర్యలు

కొత్తగూడెం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తూకాలలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా తూనికలు, కొలతలు శాఖ అధికారి కె మనోహర్ హెచ్చరించారు. ఆదివారం కొత్తగూడెం వారం తప సంతలో జిల్లా తూనికలు కొలతలు శాఖ అధికారి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చికెన్, మటన్ చేపల విక్రయాల తూకాలను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వస్తువు తూకంలో వినియోగదారులు నిశితంగా పరిశీలించాలని అన్నారు. వస్తువు బరువు సరైన విధంగా తూకం ఉన్నదో లేదో వినియోగదారులు జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. కొంత మంది వ్యాపారులు నాటు రాళ్లను వినియోగిస్తూ తూకం వేస్తున్నారన్నారు. అలాంటి ఫిర్యాదులు రోజూ చాలా వస్తున్నాయన్నారు. ఆ ఫిర్యాదుల ఆధారంగానే తనిఖీలు నిర్వహించామన్నారు. వ్యాపారస్తులపై 5 కేసులు నమోదు చేసి, రూ. 12వేల ఫైన్ విధించినట్లు పేర్కొన్నారు.

భద్రాద్రి దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్

భద్రాచలం, జనవరి 28: భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పని చేస్తున్న ఉద్యోగి రత్నం శ్రీకాంత్‌ను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి సస్పెండ్ చేశారు. దేవస్థానంలో జూనియర్ అసిస్టెంటుగా ప్రొవిజినల్ స్టోర్స్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో రికార్డులను నిర్ణీత సమయంలో సిద్ధం చేయలేదనే కారణాలతో సస్పెండ్ చేసినట్లు దేవస్థానం వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అదేవిధంగా స్టోర్స్‌లో ఉండాల్సిన స్టాక్ కంటే తక్కువగా ఉందని సంబంధిత పర్యవేక్షకులు ఇచ్చిన నివేదిక ఆధారంగా శాఖపరంగా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా దేవస్థానంలోని ప్రొవిజినల్ స్టోర్స్‌లో ఇప్పటికే సుమారు ఆరు నెలల క్రితం అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలతో ఇరువురు ఉద్యోగులను ఈవో సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ సైతం సస్పెన్షన్‌కు గురికావడం గమనార్హం.

జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీలు

ఖమ్మంక్రైం,జనవరి28: జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ పోలీసు శాఖ నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం సీసీఆర్‌బీ ఎస్ఐగా ఉన్న షేక్ షాకీర్‌ను కల్లూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా, నియమితులయ్యారు. అక్కడ ఉన్న పి.రఘును వీఆర్‌కు ఖమ్మం బదిలీ చేశారు. రఘునాథపాలెం ఎస్ఐగా ఉన్న వి.కొండలరావును తల్లాడ ఎస్‌హెచ్‌వోగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న పి.సురేష్‌ను ఖమ్మం వీఆర్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా ఖమ్మం వన్‌టౌన్ ఎస్ఐగా ఉన్న కె.వెం కటేష్‌ను వీఎంబంజర ఎస్‌హెచ్‌వోగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న సూరజ్‌ను ఖమ్మం వీఆర్‌కు బదిలీచేస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

మిరపలో మిగులేది?

- దొరకని కూలీలు.. దొరికినా ఖరీదే
- ఒకేసారి కోతకు రావడంతో డిమాండ్
- చేలల్లోనే తాలుగా మారుతున్న పంట

కొండంత ఆశతో రెక్కలు ముక్కలు చేసుకొని ఆరుగాలం కష్టపడిన మిరప రైతులకు పెట్టుబడి భారం, కూలీల కొరత లాంటి ప్రతికూల పరిస్థితులు, తగ్గిన గిట్టుబాటు ధరలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాణిజ్య పంటల పై ఆధారపడి వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేస్తేలాభాల మాట పక్కన బెడితే నష్టాలు మాత్రం వారిని వదిలి పెట్టడం లేదు. దింతో చేసిన పెట్టుబడి అప్పులు ఎలా తీర్చాలో పాలుపోక మరోవైపు మరల సాగు చేసినా ఇదే పరిస్థితి వస్తుందేమోననే నైరాశ్యంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.



తాలుకాయ ఏరుతున్న ఒడిసా కూలీలు

బోనకల్, జనవరి 28: మిరప పంట పైనే ఆశలు పెట్టుకున్న రైతులకు ఈ ఏడాది పెట్టుబడి మరింత భారంగా మారింది. ఎకరం మిరప పంట సాగుకు నారు, ఎరువులు, పై మందుల రూపం లో పెరిగిన ధరలను బట్టి దాదాపు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టారు. పైరు మొదట్లో రైతల్లో ఆశలను రేకెత్తించినా, వాతావరణ పరిస్థితుల వలన పంటకు పలు రకాల తెగుళ్ల సోకి ఎదుగుదల పై తీవ్ర ప్రభావం పడింది. పైరును కాపాడుకునేందుకు అత్యధికంగా ఎరువులతో పాటు పై మందులను వాడాల్సిన పరిస్థితి నెలకొంది. దింతో అనుకున్న దిగుబడులు రాక, వచ్చినా గిట్టుబాటు ధరలు లభించక, సాగులో మిగులు సంగతేమో కాని నష్టాలతో సరిపెట్టుకోవాల్సిన దైన్యం రైతులది.

పొరుగు రాష్ట్రాల నుంచి కూలీలు

ఇక కూలీల విషయానికి వస్తే, ఈ సమస్య రైతులకు ఎప్పుడూ లేని తలనొప్పిగా మారింది. గ్రామాల్లో రైతులందరి మిరప పొలాలు ఒకేసారి కోతలకు రావడంతో కూలీల కొరత ఏర్పడింది. ఈ సమస్యను ఆసరాగా చేసుకున్న కూలీలు రోజు కూలీ ధరలను పెంచారు. ఒక్కొక్కరికి రూ. 400, ఆటో చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో దిక్కు తోచని రైతులు వారు అడిగినంతా ఇస్తున్నారు. అడిగినంత కూలీ ఇచ్చినా కూలీల కొరత ఉండటం వలన పొరుగు రాష్ట్రాల నుంచి అదనపు ఖర్చులతో కూలీలను గ్రామాలకు తీసుకొచ్చి తోటల్లో పనులు చేయిస్తున్నారు. దీంతో క్వింటా మిరపకాయల కోతకు కూలీల ఖర్చు రూ. 6వేలు, తాలుకాయ ఏరినందుకు గానూ రూ. 2వేలు కలిపిరూ. 8వేలు ఖర్చు వస్తుంది. గతంలో ఎన్నడు లేని విదంగా ఈ ఏడాది క్వింటా మిరపకాయ కోత అత్యదికంగా ఖర్చు చేయడం రైతులకు తలకు మించిన భారంగా మారింది.

నెలల తరబడి చేలల్లోనే పంట



మిరపతోటలు కోతలకు రాగానే సకాలంలో ఏరితే రైతుకు నష్టం ఉండదు. కాని కూలీలు దొరకని కారణంగా నెలల తరబడి పంట చేలల్లోనే ఉండటం వలన తాలుకాయగా మారడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఏరినందుకు కూలీ ఖర్చులు క్వింటాకు రూ. 8వేలు కాగా, తాలుగా మారిన పంట తక్కువ ధరకు అమ్ముడు పోవడంతో కూలీల ఖర్చు కూడా రావడం లేదు. గార్లపాడు గ్రామానికి చెందిన కాపా లక్ష్మీనారాయణ ఏడు ఎకరాల్లో మిరప పంటను సాగు చేయగా ప్రకృతి వైపరీత్యాల వలన పంటదెబ్బతింది. ఎకరానికి ఐదు క్వింటాళ్ల మాత్రమే దిగుబడి రాగా, సకాలంలో ఏరనందుకు మొత్తం మిరప పంట తాలుగా మారింది. కూలీల ఖర్చు మాత్రం క్వింటాకు రూ. ఎనిమిది వేలు వచ్చిందని పెట్టిన పెట్టుబడులకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా కల్లాల్లో ఉన్నమిరప పంటను ప్రస్తుతం రూ. 16 వేలకు దళారులు అడుగుతున్నారు. మొదట్లో మార్కెట్లో క్వింటా ధర రూ. 23 వేల వరకు ఉండగా క్రమేణా ధరలు తగ్గుతుండటంతో రైతులకు మిరప గిట్టుబాటు కాక మరింత ఘాటుగా మారింది.

పజ్జొన్న పంటపై రైతుల ఆసక్తి

- తక్కువ పెట్టుబడితో అధికలాభాలు



కారేపల్లి మండలంలో జొన్నపంట

కారేపల్లి, జనవరి 28: మండలంలో పచ్చజొన్న సాగుపై రైతులు ఆసక్తిచూపుతున్నారు. గతంలో మండలంలో అత్యధికంగా రైతులుపచ్చజొన్న పంట సాగు చేసేవారు. అయితే కాల క్రమేణ పచ్చ జొన్నసాగును తగ్గించి, వరి సాగుపై దృష్టి సారించారు. వరి అధిక దిగుబడుల కోసం అనేక రకాల క్రిమిసంహారక మందులను వాడుతున్నారు. క్రిమిసంహారక మందులతో పండిన బియ్యాన్ని తినడంవల్ల ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారు. వీటికి తోడుగా బీపీ, షుగర్లు పెరగడంతో రోగాల బారిన పడుతున్నారు. వైద్యులు సూచనల మేరకు పచ్చజొన్న రొట్టె, పచ్చజొన్న గటక వంటివి ఆహారంగా తీసుకోవాలని సూచిస్తుండటంతో పచ్చజొన్నలకోసం మార్కెట్‌కు వెళుతున్నారు. దీనికి తోడు జొన్నలకు మంచి డిమాండ్ ఉంది. కిలో జొన్నలు రూ.60నుంచి రూ.70వరకు ధర పలుకుతోంది. మండలంలో చాల మంది రైతులు జొన్నపంటసాగు వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన పంట ఏపుగా ఉంది.

తక్కువ పెట్టుబడితో అధికదిగుబడి
నారాయణ, రైతు, కారేపల్లి



మార్కెట్లో పచ్చజొన్నలకు మంచి ధర పలుకుతోంది. తక్కువ పెట్టుబడితో అధికలాభాలు వస్తాయి. నేనుకూడా జొన్నపంట సాగుచేస్తున్నా. మిగతా పంటల మాదిరిగా జొన్నకు చీడపీడల బాధ చాలా తక్కువ.


దర్గాను సందర్శించిన మంత్రి తుమ్మల



హజ్రత్ సయ్యద్ యాకూబ్ షావలీ దర్గాలో చాదర్ సమర్పిస్తున్న మంత్రి

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 28: ఖమ్మం ట్యాంక్ బండ్ ఆవరణలో ఉన్న హజ్రత్ సయ్యద్ యాకూబ్ షావలీ దర్గాను రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం దర్శించుకున్నారు. ఉర్సు సందర్భంగా మంత్రి దర్గాను సందర్శించిన మంత్రి సంప్రదాయం ప్రకారం చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా మతపెద్దలు, ఉర్సు నిర్వహణ కమిటీ ప్రతినిధులు మంత్రిని సంప్రదాయబద్ధంగా స్వాగతించారు. అల్లాహ్ ఆశీర్వాదాలు, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దర్గా ముజావర్ షేక్ హబీబున్, సల్మాన్ సాహెబ్, హుస్సేన్, నాగుల్ మీరా, ఖాజామియా, కాంగ్రెస్ నాయకులు ఆశ్రిఫ్, ఖదీర్, జాకీర్, నవాజ్, షబ్బీర్, సోహెల్ పాల్గొన్నారు.

నూతన మాస్టర్‌ప్లాన్‌కు
మోక్షమెప్పుడో?



ఖమ్మం నగర మాస్టర్‌ప్లాన్

- వేలసంఖ్యలో నిర్మాణాల అనుమతులకు ఎదురుచూపు
- భారీగా ఆదాయం కోల్పోతున్న నగరపాలకసంస్థ

ఖమ్మం కార్పొరేషన్, జనవరి 27: నూతన మాస్టర్‌ప్లాన్ లేకపోవడంతో నగరపాలక సంస్థ భారీగా ఆదాయం కోల్పోతోంది. నూతన మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయి, గత ప్రభుత్వ ఆమోదానికి పంపారు. అయితే నిజామాబాద్‌తో పాటు మరికొన్ని జిల్లాల్లో నూతన మాస్టర్ ప్లాన్‌పై అక్కడి రైతులు, ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేయటంతో పాటు ధర్నాలు చేసి, ఉద్రిక్త వాతావరణం ఏర్పడటం తో నూతన మాస్టర్‌ప్లాన్ల ఆమోదాన్ని గత ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో నగరానికి సంబంధించిన నూతన మాస్టర్‌ప్లాన్ ఆమోదం వాయిదా పడింది.

572 చదరపు కిలోమీటర్ల పరిధిలో..

స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) ఏర్పడటంతో 572 కిలోమీటర్ల పరిధిలో వర్తించేటట్లు మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేశారు. సుడా పరిధిలో ఖమ్మం నగరపాలకసంస్థ, వైరా పట్టణం, ఇదే నియోజకవర్గంలోని కొణిజర్ల మండలంలోని నాలుగు గ్రామపంచాయతీలు, పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలోని రెండు పంచాయతీలు, మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలంలో ఐదు పంచాయతీలు, చింతకాని మండలంలోని ఆరు గ్రామపంచాయతీలు, ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో నాలుగు గ్రామపంచాయతీలు ఉన్నాయి. రాబోయే 20 సంవత్సరాలలో సుడా పరిధిలో జనాభా సుమారు 20లక్షలకు చేరుకుంటుందని భావించి అందుకు అనుగుణంగా నూతన మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేశారు. రహదారుల విస్తరణ, కొత్తగా వంతెనల నిర్మాణం తదితర అంశాలను ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. అంతేకాకుండా ఖమ్మంలో వాణిజ్యప్రాంతాలు, నివాస ప్రాంతాల విషయం లో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. కొత్తగా తయారుచేసిన మాస్టర్‌ప్లాన్‌లో దీనిని సవరించారు. బఫర్‌జోన్ విషయంలో క్షుణ్ణంగా పరిశీలించి, కొన్ని సవరణలు చేశారు. ఇలా అందరికీ ఆమోదయోగ్యంగా తయారుచేసిన నూతన మాస్టర్‌ప్లాన్ ప్రభుత్వ ఆమోదానికి ఎదురు చూస్తోంది.

నిలిచిన 5వేల నిర్మాణ అనుమతులు

నూతన మాస్టర్‌ప్లాన్ లేకపోవటంతో సుమారు 5వేల నిర్మాణాలకు సంబంధించిన అనుమతులు ఆగిపోయాయి. ఎందుకుంటే గతంలో ప్రతిపాదించిన 80, 100 అడుగుల రహదారులు పాత మాస్టర్‌ప్లాన్‌లో ఉన్నాయి. ప్రస్తుతం సదరు రహదారుల నిర్మాణాలను రద్దు చేసినప్పటికీ మాస్టర్‌ప్లాన్‌లో అలాగే ఉండిపోయాయి. దీనివల్ల కొత్తగా నిర్మాణాల అనుమతికి దరఖాస్తు చేసుకుంటే సదరు స్థలాల గుండా రహదారులు పోతున్నాయని అనుమతులు ఇవ్వటంలేదు. ఇలా సుమారు 5వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో నగరపాలకసంస్థ కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతోంది. ప్రభుత్వం కొత్తమాస్టర్‌ప్లాన్‌కు అనుమతి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

4 నుంచి భద్రాచలంలో
అంతర్రాష్ట్ర నాటకోత్సవాలు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 28: భద్రాచలంలో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 22వరకు అంతర్ రాష్ట్రస్థాయి నాటకోత్సవ సాంస్కృతిక సంబురాలు నిర్వహించనున్నారు. భద్రాద్రి కళాభారతి తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ, తాళ్లూరి పంచాక్షరయ్య సన్స్, ఐటీసీ, తెలంగాణ నాటకరంగ అభివృద్ధి సంస్థ, తదితర సంస్థల ఆధ్వర్యంలో తాళ్లూరి భారతీదేవి జ్ఞాపకార్థం మూడు రోజుల పాటు భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఈ సంబురాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సూపర్ సింగర్-3 విజేత అవినాష్ జయసింహ, ప్రముఖ సినీ నటులు పృథ్వీరాజ్, జీ తెలుగు సరిగమ ఫేమ్ పార్వతి, భద్రాద్రి దేవస్థానం వేద పండితులు చిట్టి హనుమత్‌శాస్త్రిలకు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నారు. ఈ మూడు రోజుల పాటు సాంఘిక నాటికలు, నృత్యాలు, మిమిక్రీ తదితర కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం భద్రాచలంలో భద్రాద్రి కళాభారతి అంతర్ రాష్ట్రస్థాయి నాటకోత్సవ సంబరాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రామారావు, పాకాల దుర్గాప్రసాద్, పాకాలపాటి చంద్రశేఖర్, వల్లూరిపల్లి వంశీకృష్ణ, తాళ్లూపూడి రాము, గట్టు వెంకటాచార్య, ఎస్కే అజీమ్, చారుగుళ్ల శ్రీనివాస్, బి.కృష్ణయ్య, బి.వెంకటరెడ్డి పి.నరసింహారావు, అంబేద్కర్, అల్లం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'జీఎస్టీ' సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం మార్కెట్, జనవరి 28: జీఎస్టీ విధానం, ఇన్‌కమ్‌టాక్స్ చెల్లింపులలోని సాంకేతిక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే పరిష్కరించాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ (సౌత్‌జోన్) ఛైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె. నర్సింగరావు, ఎంవీజే కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో జరిగిన జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా టాక్స్ ప్రాక్టీషనర్స్ ఫెడరేషన్ మాజీ ఛైర్మన్ సీతాపతిరావు, జిల్లా టాక్స్ ప్రొఫెషనల్స్ సంఘ బాధ్యులు దుర్గాప్రసాద్, ఉల్లిబోయిన సైదులు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు కష్టం.. దానం దోపిడీకి చెక్

- మంత్రి తుమ్మల ఆదేశాలతో మార్కెట్‌లో దానం విధానం రద్దు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



మార్కెట్లో రైతు పంటను దానం చేస్తున్న హమాలీ

ఖమ్మం మార్కెట్ జనవరి 28: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతుల కష్టాన్ని దోచే బిక్షం అడుక్కునే విధానానికి ఎట్టకేలకు చెక్‌పెట్టారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో మార్కెట్‌లో రైతులకు భారీ ఊరట లభించినట్లైంది. రైతులు అహర్నిషలు అప్పులు చేసి, కష్టపడి పండించిన పంటను మార్కెట్‌లో నిత్యం దానం విధానం ద్వారా భారీగా నష్టపోతున్నారు. రైతు పంట ఖరీదైన అనంతరం కాంటాల సమయంలో హమాలీలు, స్వీపర్లు, రెల్లుడు కార్మికులు తీసుకునే బిక్షం అడుక్కునే పద్ధతిని పూర్తిగా రద్దుచేశారు. ఇది మార్కెట్ చరిత్రలోనే చారిత్రాత్మక ఘట్టంగా వర్ణిస్తున్నారు వ్యాపారులు, రైతులు.

ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శనివారం మంత్రి తుమ్మల ఆదేశాలతో మార్కెట్ చాంబర్‌లో వ్యాపార, కార్మిక సంఘాలతో నిర్వహించిన సమీక్షలో తక్షణమే బిక్షం అడుక్కునే విధానానికి స్వస్తి పలకాలని నిర్ణయించారు. ఈనెల 18న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'హమాలీల ఆగడాలు'... 'ముష్టి విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్' శీర్షిక ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనానికి స్పందించి ముష్టి విధానం రద్దుకు నిర్ణయం తీసుకున్నారు. అంతేకాకుండా కమీషన్ వ్యాపారులు, ట్రేడర్లు, మహిళా స్వీపర్లు, రెల్లుడు కార్మిక సంఘాలు సైతం మార్కెట్లో ఇక నుంచి ముష్టి విధానాన్ని రద్దు చేస్తామని ఏకతాటిపై నిర్ణయం తీసుకోవడం విశేషం. మార్కెట్లో ఇకపై బిక్షం అడగబోమని హామీ ఇచ్చారు.

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అన్నదాతలకు మేలు చేసే నిర్ణయం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యం మేరకు సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



సీఎంఆర్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 28: కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీకి ప్రభుత్వం ఈ నెల 31 వరకు గడువు ఇచ్చిందని, ఆలోగా కేటాయించిన లక్ష్యం మేరకు మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీ పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. ఆదివారం అదనపు కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంలోని సత్యనారాయణ సిల్కి అండ్ సార్టెక్స్ రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఖరీఫ్ సీఎంఆర్ రైస్ డెలివరీ విషయమై, కేటాయించిన లక్ష్యం, ఇంతవరకు అందించిన రైస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లులు పూర్తి సామర్థ్యం మేర నిర్వహించి, రైస్ ఉత్పత్తిలో వేగం పెంచి లక్ష్యం మేరకు ఈఎంఆర్ బియ్యం డెలివరీ చేయాలని, నిర్దేశిత సమయంలో లక్ష్యాలు చేరుకోని రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు. వానాకాలం పంటకు సంబంధించిన పెండింగ్ ఉన్న సీఎంఆర్ డెలివరి దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ఇంకా గడువు పొడిగింపు ఉండదని ఆయన స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇంకనూ 3354.577 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాల్సి ఉందన్నారు. లక్ష్యం చేరని మిల్లర్లను బ్లాక్‌లిస్ట్‌లో ఉంచనున్నట్లు, తగుచర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ హెచ్చరించారు.

రేపు జడ్పీ స్థాయిసంఘాల సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 28 : జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలను ఈనెల 30న జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో వింజం వెంకట అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం ఉదయం 10:30 లకు మొదలవుతుంది. సాయంత్రం వరకు కొనసాగుతుంది. ఉదయం 10:30గంటలకు 2 స్థాయి సంఘం సమావేశం గ్రామీణాభివృద్ధిపై, ఉదయం 11:30 గంటలకు 4 వస్థాయి సంఘం విద్య వైద్యం, 12:30 గంటలకు 1వ స్థాయి సంఘం ఆర్థిక మరియు ప్రణాళిక ,7వ సంఘం పనులు, మధ్యాహ్నం 2:30 గంటలకు 3వ స్థాయి సంఘం వ్యవసాయం, సాయంత్రం 3:30గంటలకు 5వ స్థాయి సంఘం మహిళా సంక్షేమం, సాయంత్రం 4:30 గంటలకు 6వ స్థాయి సంఘం సాంఘిక సంక్షేమం స్థాయి సంఘం సమావేశం తదితర అంశాలపై చర్చించనున్నారు. దీనికోసం ఇప్పటికే స్థాయిసంఘాల కమిటీల సభ్యులకు లేఖలు అందించారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు సమీక్షలను సిద్ధం చేసి ప్రతులను జిల్లా పరిషత్ కార్యాలయంలో అందచేయాలని సీఈవో కోరారు.

ఆసక్తి రేపుతున్న రంగం.. స్టార్టప్

- గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలకు అవకాశం
- ఐఎస్ఎఫ్ సభ్యుడు జేపీ చౌదరి



ప్రసంగిస్తున్న జేపీ చౌదరి

భద్రాచలం, జనవరి 28: ప్రపంచ వ్యాప్తంగా విస్తృత అవకాశాలున్న స్టార్టప్ రంగం గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలకు యువత ముందుకు రావాలని అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ సభ్యుడు జేపీ చౌదరి అన్నారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన ఐఎస్ఎఫ్ సమావేశంలో ఐఎస్ఎఫ్‌కు చెందిన వివిధ ప్రాంతాల సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న కాలంలో రూరల్ స్టార్టప్స్ కోసం ప్రత్యేక దృష్టి పెట్టాలని సభ్యులను కోరారు. ఐఎస్ఎఫ్ రానున్న కాలంలో చేయబోయే కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. ఈ సమయంలో పలువురు సభ్యులు రూపొందించిన నూతన ఆవిష్కరణలను తెలియజేశారు. మహేష్ సత్యేంద్రవర్మకు చెందిన నూతన స్టార్టప్‌లను ఆవిష్కరించారు. గ్రామీణ నేపథ్యంలో 'నేటివ్ అరకు స్థాపన' సక్సెస్ స్టోరీని ఆ సంస్థ సీఈవో రాంకుమార్ వర్మ నివేదించడం అందరినీ ఉత్సాహపరించింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోరేటి రోహిత్, వివేక్, సునీత, నాగజ్యోతి, బెల్జియం, జర్మనీ, సింగపూర్, నెథర్లాండ్స్, యూకే నుంచి వచ్చిన ఎన్నారై సభ్యులు పాల్గొన్నారు.

కేపీఎల్ క్రికెట్ టోర్నీ
లోగో ఆవిష్కరణ

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 28: వచ్చేనెల రెండో వారంలో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించనున్న ఖమ్మం ప్రీమియర్ లీగ్ డే అండ్ నైట్ క్రికెట్ పోటీల లోగోను టోర్నీ నిర్వాహకులు ఆదివారం ఎస్పీ స్టేడియంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కమర్తపు మొరళి, డీవైఎస్‌వో సునిల్ రెడ్డి, ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, ఆశ్రిఫ్, మతిన్ తదితరులు ఉన్నారు.

క్వార్టర్స్ దశకు రాజీవ్ ట్రోఫీ

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 28: నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు క్వార్టర్ ఫైనల్స్ దశకు చేరుకున్నాయి. ఇప్పటి వరకు లీగ్ మ్యాచ్‌లలో ఉత్తమ ఆటతీరును ప్రదర్శించిన సత్తుపల్లి జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం పోటీలను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లలో సత్తుపల్లి జట్టు ఖమ్మం రూరల్ జట్టుపై, కొణిజర్ల జట్టు వైరా జట్టుపై విజయం సాధించాయి. పోటీలను నిర్వాహకులు మతిన్ సమీక్షించారు.



సంక్షేమబాట పుస్తకాన్ని ఆవిష్కస్తున్న దృశ్యం

పెన్షనర్ల సమస్యల్ని పరిష్కరించాలి

- టీజీవో నాయకుడు ఏలూరి

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 28: పెన్షనర్ల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ఆరోగ్య సంరక్షణకు హెల్త్ కార్డు అమలు చేయాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు ఆదివారం ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాలలో కే సీతారాములు అధ్యక్షతన తెలంగాణ సంక్షేమ శాఖల విశ్రాంతి అధికారుల సంక్షేమ వసతి గృహ అధికారుల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీతారాములు రచించిన సంక్షోభంలో సంక్షేమ బాట పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కే సీతారాములు తన ఉద్యోగ అనుభవాలను అలాగే సంఘాల నిర్వహణలో అనేక సమస్యల్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కార మార్గానిక కృషి చేశారని ఆయన సాహిత్యసేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బి, పిచ్చిరెడ్డి మహిళా సంఘం ప్రతినిధి వెంకట నరసమ్మ , నాయకులు గంగయ్య సుదర్శన్, జయరాజు సాంబయ్య తదితరులు హాజరయ్యారు.

మువ్వన్నెల జెండా..
మురికితో నిండే..

ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 28: గత మూడు రోజుల క్రితం 75వ గణతంత్ర వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించారు. కానీ ప్రతి నిత్యం 30వేల మంది ప్రయాణికు లతో రద్దీగా ఉండే ఖమ్మం రైల్వేస్టేషన్‌లో ఆకర్షణీయంగా 100 అడుగుల మువ్నెలజెండాను ఏర్పాటు చేశారు. కానీ 100 అడుగుల జెండాను రైల్వే అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ప్రస్తుతం మీరెవ్వరైనా రైల్వేస్టేషన్‌కు వెళ్లి ఆ జెండాను ఓ మారు పరిశీలిస్తే మురికితో నిండిపోయి.. కళావిహీనంగా దర్శనం ఇస్తోంది. కేంద్ర ప్రభుత్వ అధికారులే జాతీయజెండా పట్ల అలక్ష్యంగా వ్యవహరించడం పట్ల స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు, ప్రజలు జాతీయ జెండాను చూసి నివ్వెర పోతున్నారు..!



మురికిపట్టి మాసిపోయిన జెండా


కొండప్పకు పద్మశ్రీ పురస్కారం
కళా ప్రపంచానికే గౌరవం

- డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని



కొండప్పను అభినందిస్తున్న మల్లు నందిని

ఖమ్మం సాంస్కృతికం/ వైరా, జనవరి 28: ప్రాచీన కళలను, చరిత్రను సమాజానికి తెలియజేసేలా సమాజం గుర్తుంచుకునేలా కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలను ప్రకటించిందని, కొండప్పకు పురస్కారం కళా ప్రపంచానికి గౌరవమని డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని చిన్నజీయర్ స్వామి ఆశ్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పను ఆమె శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంప్రదాయ సేవాసమితి బాధ్యులు నంబూరి కనకదుర్గ, దాశరధి శివప్రసాద్ కామళ్ల కృష్ణ, మల్లు ప్రతిభ తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దామరగిద్దకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పను వైరా జడ్పీటీసీ సభ్యురాలు నంబూరి కనకదుర్గ సన్మానించారు. ఆదివారం హైదరాబాద్‌లో శ్రీరామానుజ నిత్యవైష్ణవ సేవ సంఘం రాష్ట్ర బాధ్యులతో కలిసి కొండప్పను ఆమె సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాధ్యులు దాసరి శివప్రసాద్, సిద్దిపట్ల సంపత్‌కుమార్, కె.కృష్ణ, డాక్టర్ ప్రతిభాకల్యాణ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నాట్య గురువుకు నంది పురస్కారం

ఖమ్మంసాంస్కృతికం, జనవరి28: భారత్ ఆర్ట్స్ అకాడమీ వారి స్వర్ణ నంది పురస్కార వేడుకలు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం జరిగాయి. ఈ వేడుకల్లో ఖమ్మం అభినయరుద్ర నాట్యాల గురువు కణతాల ఫణిల్‌కు నంది పురస్కారం దక్కింది. సినీనటుడు బాబు మోహన్ ఈ పురస్కారాన్ని అందజేసి కళాకారులను అభినందించారు. ఆయన వద్ద శిక్షణ పొందిన కళాకారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శనలకు గాను ఈ అవార్డు అందజేశారు.



మందకొడిగా కేవైసీ ప్రక్రియ

- గడువు ముంచుకొస్తున్నా పూర్తి ఆధార్, రేషన్‌కార్డుల అనుసంధానం
- జిల్లాలో 70 నుంచి 80శాతం మాత్రమే పూర్తి
- చేతి వేలిముద్రలు పడక వృద్ధుల అవస్థలు

మధిర,జనవరి28:: రేషన్ కార్డుల కేవైసీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. జిల్లాలో 70నుంచి 80శాతంకు మించి పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఈనెల31 వరకే గడువు ఉండటంతో ఇది పూర్తికావటం ఇబ్బందిగా మారింది. కొందరి వృద్ధుల చేతి వేళ్ల అరిగిపోవడంతో గీతలు మిషన్‌లో పడటంలేదు. మరికొందరు ఇంటినుంచి బయిటికి రాలేని పరిస్థితి నెలకొంది. కొందరు దూరప్రాంతాల్లో ఉంటున్న పిల్లలు, వివాహాలై ఇతర ప్రాంతాలకెళ్లిన వారి కేవైసీ పెండింగ్ ఉన్నట్లు తెలుస్తుంది. చనిపోయిన వారి పేర్లు తొలగించాల్సి ఉంది. కొందరి ఆధార్ కార్డులు నెంబర్లు మారడంతో సరిపోవడం లేదని తెలుపుతున్నారు. రేషన్ దుకాణాల్లో బోగస్ కార్డులతో పాటు మరణించిన వారిపేర్లు, వివాహాలు చేసుకొని వెళ్లిన ఆడపిల్లలు పేర్లు తొలగించకుండానే బియ్యం తీసుకుంటున్నపరిస్థితి కొనసాగుతుంది. దీన్ని సరిచేసి బోగస్ ఏరి వేయాలని గత ఏడాది సెప్టెంబరులో ప్రభుత్వం ఈ కేవైసీ ప్రక్రియను చేపట్టింది. 5నెలలుగా లబ్ధిదారుల వివరాలతో పాటు వేలి ముద్రలను మరోసారి సేకరిస్తున్నారు.



జిల్లా 7,27,928 మంది లబ్ధిదారులు

జిల్లాలో ఎన్ఎఫ్ఎస్‌సీలో 2,32,257కార్డులుంటే 7,27,928 లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 79.54శాతం మాత్రమే కేవైసీ పూర్తిఅయింది. ఎస్ఎఫ్ఎస్‌సీలో 1,79,090 కార్డులుండగా 4,04,943 మంది లబ్ధిదారులున్నారు. వీరిలో 66.50శాతం మాత్రమే కేవైసీ అయింది. మొత్తంగా 74.88శాతం కేవైసీ పూర్తి అయింది. కామేపల్లి మండలంలో అత్యల్పంగా 70 శాతం పూర్తికాగా, తల్లాడ మండలంతో అత్యధికంగా 80శాతం పూర్తిఅయింది. వృద్ధుల విషయంలో వేలిముద్రలుకాకుండా ఇంకో ఆప్షన్ లేకపోవడం పెద్ద సమస్యగా ఉంది. వేలి ముద్రలు పడని వారికి మరో ఆప్షన్ ఇవ్వాలని కోరుతున్నారు. ఈనెల 31తో గడువు ముగిసిన తర్వాత కేవైసీ కాని కార్డులదారులకు రేషన్ బంద్ అవుతుందని తెలుస్తోంది. దూరప్రాంతాల్లోఉంటున్న వారికి రాష్ట్రంలో అయితే అక్కడే కేవైసీ చేసుకొనే వెసులుబాటు ఉంది. రాష్ట్రేతర ప్రాంతాల్లో ఉంటున్న వారి విషయంలోనే కేవైసీలుపెండింగ్‌లో ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు.

జిల్లాలో మంత్రి తుమ్మల విస్తృత పర్యటన

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి28: వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. పలుకార్యక్రమాల్లో పాల్గొన్నారు. క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కుమ్మరి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. హరిత గార్డెన్‌లో నిర్వహించిన ప్రముఖ వైద్యుడు కుమారుని బారసాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఖమ్మం మూడో పట్టణంలో ఇటీవల మరణించిన మూసా పద్మావతి, తేరాల రామారావు సంస్మరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రకాశ్‌నగర్‌లో నిర్వహించిన పెరిక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయ, చావా నారాయణరావు, రావూరి సైదబాబు, మిక్కిలినేని నరేంద్ర, నల్లమల్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పెరిక సంఘం సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి

జక్కంపూడికి తుమ్మల పరామర్శ

తల్లాడ: మండల పరిధిలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తిని ఆదివారం నాగేశ్వరరావు పరామర్శించారు. కృష్ణమూర్తి అనారోగ్యానికి గురయ్యారనే సమాచారం తెలుసుకొని నివాస గృహానికి వచ్చి పరామర్శించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఖమ్మంచర్చికాంపౌండ్: శ్రీమొల్లమాంబ కుమ్మరి సంఘం క్యాలెండర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుదారపు సూరిబాబు, ప్రధాన కార్య దర్శి దరిపల్లి చంద్రశేఖర్, సిలివేరు జనార్ధన్, చలిగంటి భిక్షం,మొగిలిచర్ల సైదులు,మల్లెలరాధాకృష్ణ పాల్గొన్నారు.

హనుమాతండ సర్పంచ్ సేవలు అభినందనీయం

సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



సర్పంచ్ మోహన్‌నాయక్ దంపతులను సన్మానిస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, జనవరి 28 హనుమతాండ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన సర్పంచ్ మోహన్‌నాయక్ సేవలు అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ఆదివారం హనుమాతాండ గ్రామంలో పంచాయితీ పాలకవర్గం ఐదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గిరిజనుల సమస్యల కోసం సర్పంచు ఏంతో గాను కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే రాగమయి సర్పంచ్ మోహన్‌నాయక్ నాగమణి దంపతలతో పాటుగా పాలకవర్గ సభ్యులను సత్కరించారు. సర్పంచ్ మోహన్‌నాయక్ మాట్లాడుతూ తన పదవి కాలంలో గ్రామా అభివృద్ధిలో సహకరించిన ప్రజలకు అభినందనలు తెలిపారు. అనంతరం 500 మంది మహిళలకు చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, భూక్యా శివకుమార్‌నాయక్, సైదానాయక్, రవికుమార్‌నాయక్, కుమార్‌నాయక్, ఉపసర్పంచు సూరానాయక్ బాగం ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేయించుకోవాలి

సత్తుపల్లి, జనవరి28: ఆరోగ్య సమస్యలపై పరీక్షలు చేయించుకోవాలని 15వ ప్రత్యేక బెటాలియన్ కమాండెంట్ పీ.వెంకట్‌రాములు అన్నారు. ఆదివారం మండలంలోని గంగారం బెటాలియన్‌లో సత్తుపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా దంత, కంటి వైద్య శిబిరం నిర్వహించగా ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు పరీక్షలు చేశారు.

1నుంచి సీలింగ్ కార్మికుల సమ్మె

ఖమ్మంచర్చికాంపౌండ్,జనవరి28: ఖమ్మం నగరంలో సీలింగ్ వర్కు చేస్తున్న కార్మికులకు, కాంట్రాక్ట్ మేస్త్రీలకు పెరిగిన ధరలకు అనుగుణంగాకూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 1నుంచి 10వతేదీ వరకు సమ్మె నిర్వహిస్తున్నట్లు సీలింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు కోలా సాగర్ తెలిపారు. ఆదివారం నగరంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు.

టీడీపీ నేత రామనాథం పరామర్శ

బోనకల్, జనవరి28: మండలంలోని రావినూతల గ్రామంలో ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు సతీమణీ పద్మావతి మోకాలు అపరేషన్ చేయించుకోగా ఆమెనుపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం పరామర్శించారు. మరియు గ్రామశాఖ వట్టికొండ లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, నాయకులు జగన్మోహన్ రావు, షైనేని రవి కుమార్, ప్రసాద్, నాగమల్లేశ్వరావు పాల్గొన్నారు.

కొరిపల్లికి కీర్తిపురస్కార్ అవార్డు

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి28: ఖమ్మానికి చెందిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ కొరిపల్లి శ్రీనివాస్ న్యూలైఫ్ థియోలాజికల్ యూనివర్శిటీ నుంచి కీర్తిపురస్కార్ నేషనల్ అవార్డు అందుకున్నారు. ఆదివారం హైదరాబాదులో ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

యువభారత్ శక్తి పౌండేషన్‌కు భారత సేవారత్న అవార్డు

సత్తుపల్లిరూరల్,జనవరి28: యువభారత్ శక్తి పౌండేషన్ ఫౌండర్ కామెర క్రాంతికి విశాఖపట్టణానికి చెందిన తాసుబెల్లి ఫౌండేషన్ భారత సేవారత్న అవార్డు అందజేసింది. ఆదివారం వైజాగ్‌లో నిర్వహించిన సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో అవార్డు మెమెంటోతో పాటు పౌండేషన్ బాధ్యులును సన్మానించారు.

డివిజన్ కమిటీ ఎన్నిక

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి28: నగరంలోని 4,5,6 డివిజన్లకు చెందిన మున్నూరుకాపు డివిజన్ కమిటీని ఆదివారం నగరంలోని 4వడివిజన్ సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకులగాంధీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా తెడ్డు రమేష్, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల గోవర్ధన్, కోశాధికారిగా యుగంధర్, గౌరవ ఆధ్యక్షుడిగా కేదాసు నరసయ్య, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా సుంకర రమేష్, సహాయ కార్యదర్శిగా రాంచందర్‌రావుతోపాటు పలువరుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తల్లాడ ఎస్ఐగా కొండల్‌రావు

తల్లాడ, జనవరి 28: తల్లాడ ఎస్ఐగా కొండల్‌రావు నియమితులయ్యారు. ఆయన రఘునాథపాలెం ఎస్ఐగా పనిచేస్తూ తల్లాడకు బదిలీ అయ్యారు. తల్లాడ ఎస్ఐ పి.సురేష్ జిల్లా హెడ్‌క్వార్టర్‌కు బదిలీ అయ్యారు.

టాలెంట్‌టెస్టులో ప్రతిభ

తల్లాడ,జనవరి28:మండలస్థాయి చెకుముఖి టాలెంట్ టెస్టు పోటీల్లో తెలుగుమీడియం విభాగంలో జడ్పీఎస్ఎస్ అన్నారుగూడెం,ఇంగ్లీష్‌మీడియం విభాగంలో జడ్పీఎస్ఎస్ కుర్నవల్లి పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ప్రైవేట్ ఇంగ్లీష్‌మీడియం విభాగంలో తల్లాడ బాలభారతి విద్యాలయం విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. ఎంఈవో ఎస్.దామోదర్‌ప్రసాద్, తల్లాడ హైస్కూల్ హెచ్ఎం పారుపల్లిప్రసూన్న బహుమతులు అందజేశారు. బోనకల్: రావినూతల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన చెకుముకి టెస్టులో బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులుప్రతిభను చాటారు. గుడిదె అఖిల, గుడిదె ఉమశ్రీ, పెద్దప్రోలు వెంకటస్వాతి ప్రథమ స్థానం సాధించారు. వీరికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

హామీలు అమలు చేయాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి28: నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కొట రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడారు.

పెన్షన్.. ప్రభుత్వ బాధ్యత

ఖమ్మంసంక్షేమవిభాగం,జనవరి28: ఉద్యోగాలు చేసిన వారికి పెన్షన్ ఇవ్వటం ప్రభుత్వ బాధ్యతగా తీసుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ నర్సింహారావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించినసంఘం సమావేశంలో మాట్లాడారు. నాయకులు పురుషోత్తమరావు, నర్సింగరావు, బాల మల్లేష్, వనం వెంకటఅప్పారావు, జగదీష్, చంద్రనియోగి, వేముల మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

దళిత బంధుపై స్పష్టత ఏది: బీజేపీ

మధిర, జనవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50రోజులైనా దళిత బంధుపై స్పష్టత లేదని బీజేపీ నాయకులు విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఏలూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ వివిధ సమస్యలను ప్రస్తావించారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు పాపట్ల రమేష్, పగడాల నాగేంద్రబాబు, గరిడేపల్లి వేణు, రామకృష్ణ, కనకచారి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తుసంఘంలో చీరెల పంపిణీ



సత్తుపల్లిరూరల్, జనవరి28: సత్తుపల్లి మునిసిపాలిటీలోని ఎన్టీఆర్ నగర్‌లో క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో 50మంది మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు బాలస్వామి, సబిత దంపతులు అందించిన రూ.10వేలతో చీరెలను అందించామన్నారు. కార్యక్రమంలో అలవాల లక్ష్మీ, కొత్తపల్లి ప్రభాకర్, అనిల్‌కుమార్, తడికమళ్ల ప్రకాశరావు, నల్లగట్ల బాస్కర్‌రావు, నూతక్కి నవకుమార్, ఇనపనూరి నాగేశ్వరరావు, పీ.కుమార్, కంటిపూడి వెంకటేశ్వరరావు, సువార్తీకులు పూరేటి సామేలు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఎంపికలకు స్పందన

ఖమ్మంస్పోర్ట్స్, జనవరి28: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్- 8, 10, 12, 14 బాలురు, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలకు భారీ స్పందన లభించింది. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా 147 మంది క్రీడాకారులు హాజరైనారు. పోటీలను డీఈవో సోమశేఖరశర్మ, సీఐ నరేష్ ప్రారంభించారు. జిల్లా జట్టులో అండర్- 8 విభాగంలో లోహిత, అనుశ్రీ, అక్షాంత్‌చంద్ర, వివేక్ క్రిష్ణన్, హర్ష అండర్- 10 విభాగంలో సోహిత్‌చంద్ర, అండర్- 12 విభాగంలో రుతిక, అనన్య, స్రవంతి, నవ్య, అనిల్‌కుమార్, ఉపేక్షిత్, అవినాష్‌రెడ్డి ఎంపికయ్యారు. అండర్- 14 విభాగంలో వెంకటేష్, ఆనందతీర్థ, రిష్వశ్రీ, అక్షయ, నక్షత్రలు ఎంపికైనట్లు తెలిపారు. వారు ఫిబ్రవరి 10న కొత్తగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికలను అథ్లెటిక్స్ కోచ్ గౌస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సమీక్షించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సాధికారిత

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి28: కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సాధికారిత ఏర్పాడుతుందని జిల్లా కాంగ్రెస్ నాయకులు తుంబూరి దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శక్తి సూపర్ షీ(ఎస్ఎస్ఎస్) విభాగం జిల్లా సమన్వయకర్తగా హారిక ఎన్నికైన సందర్భంగా ఆదివారం పొంగులేటి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. శక్తి సూపర్ షీ విభాగం మహిళలకు రక్షణగా నిలవాలని వారి హక్కుల్ని కాపాడాలన్నారు.

విప్లవ పార్టీల ఐక్యత మహాసభను జయప్రదం చేయాలి

ఖమ్మంరూరల్, జనవరి 28: ఖమ్మంలో మార్చి 3,4,5 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, పీసీసీ సీపీఐఎంఎల్, సీపీఐఎంఎల్ ఇనిషియేటీవ్ మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్రనాయకుడు గుర్రం అచ్చయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఎమ్ వెంకటాయపాలెంలో పాతర్ల జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడారు.

నా కుమారుడికి న్యాయం చేయాలి

సెల్‌టవర్ ఎక్కి తండ్రి హల్‌చల్

ముదిగొండ, జనవరి28: తనకు, తన కుమారుడికి న్యాయం చేయాలని కోరుతూ ఓ తండ్రి సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ సంఘటన ముదిగొండ మండలం గోకినపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గోకినపల్లి గ్రామానికి చెందిన పయ్యావుల వినోద్ భార్య ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. కాగా తన కుమారుడి పేరుమీద ఆమె కుటుంబ సభ్యులు డబ్బులు బ్యాంకులో డిపాజిట్ చేస్తామని చెప్పారు. కాగా ఈ నగదును తాత పేరుమీద బ్యాంకులో డిపాజిట్ చేయడంతో వినోద్ తనకు న్యాయం చేయాలని సెల్‌టవర్ ఎక్కి ఆందోళన చేశాడు. ఈ ఘటన జరిగిన ఆసమయంలో పంచాయతీ చేసిన పెద్దమనిషి రూ.1.50లక్షల నగదు తీసుకొని తమకు అన్యాయం చేశాడని వినోద్, కుటుంబసభ్యులు ఆరోపించారు. తన కుమారుడి పేరుమీద బ్యాంకులో డబ్బులు వేయకుండా తన భార్య తాత పేరుమీద ఎందుకు వేశారని, తన కుమారుడి పేరుమీద ఆడబ్బులను డిపాజిట్ చేయాలని వినోద్ డిమాండ్ చేశాడు. వినోద్ సెల్‌టవర్ ఎక్కి ఆందోళన చేయడంతో వినోద్ తల్లిదండ్రులు, బంధువులు ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై న్యాయం చేయాలని రాస్తారోకో చేపట్టారు. దీంతో రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిల్చిపోయాయి. సమాచారం అందుకు సీఐ రాజిరెడ్డి సంఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి వినోద్‌ను సెల్‌టవర్ నుంచి కిందకు దించారు. వినోద్‌కు న్యాయం జరిగేలా మాట్లాడతామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.




గోకినపల్లిలో సెల్‌టవర్ ఎక్కిన వినోద్, రహదారిపై రాస్తారోకో చేస్తున్న వినోద్ కుటుంబసభ్యులు, బంధువులు

రఘునాథపాలెం ఎస్ఐ కొండల్‌రావుకు వీడ్కోలు

రఘునాథపాలెం,జనవరి28: రఘునాథపాలెం ఎస్ఐ తల్లాడకు బదిలీపై వెళుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ కొండల్‌రావు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సీఐ శ్రీధర్, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిదులు ఆయన సేవలను కొనియాడారు. తల్లాడకు బదిలీ జరిగిన కొండల్‌రావును ఆదివారం రఘునాథపాలెం సర్కిల్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, మీడియా, పిర్యాదుదారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు కొండల్‌రావు పనిచేశారని వక్తలు గుర్తు చేశారు. వివాదరహితంగా పని చేశారని చెప్పారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా తోటకూరి

చింతకాని జనవరి 28: మండల యూటీఎఫ్ అధ్యక్షునిగా 4వ సారి తోటకూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఉదారపు నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఆదివారం నిర్వహించిన యూటీఎఫ్ మండల పదో మహాసభలో మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు వైరా ఎమ్మెల్యే పరామర్శ

వైరా,జనవరి28:మండలంలోని సిరిపురంలో పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ ఆదివారం పరామర్శించారు. ఆగ్రామంలో జరిగిన దశదిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర మార్క్‌ఫెడ్ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు మచ్చా వెంకటేశ్వరరావు (బుజ్జీ), పొదిల హరినాథ్, కూరాకుల ప్రసాద్, మట్టూరి నాగేశ్వర రావు, పమ్మి అశోక్,నారపోగు నాగరాజు, సాధినే నినాగు, ఐనాల రాంబాబు,ఇనపనూరి వెంకటేశ్వర రావు, మున్నా యాదవ్, వి.స్వామి, వేముల కృష్ణప్రసాద్ ఉన్నారు.



బాలిక చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

'ఖమ్మం డీసీసీబీ ఛైర్మన్ పదవి మేకల మల్లిబాబుకు ఇవ్వాలి'

నేలకొండపల్లి, జనవరి28: డీసీసీబీ డైరెక్టర్‌గా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న మేకల మల్లిబాబు యాదవ్‌కు ఖమ్మం డీసీసీబీ ఛైర్మన్ పదవిని కేటాయించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా నాయకుడు మల్లెబోయిన శ్రీనివాసరావుకోరారు. ఆదివారం నేలకొండపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 25సంవత్సరాలుగా జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారని, రాష్ట్ర డైరెక్టర్‌గా, రాజకీయాల్లో మచ్చలేని నాయకునిగా కొనసాగుతున్న మల్లిబాబు యాదవ్‌కు డీసీసీబీ ఛైర్మన్ పదవిని కేటాయించటం సముచితంగా ఉంటుందన్నారు. సమావేశంలో బీసీ సంఘాల బాధ్యులు కనకబండి రమేష్, మల్లెబోయిన ఉపేందర్, చిలకల లింగయ్య, మారుతి కోటి, నూక వెంటేశ్వరరావు, చంద్రకాని మధు, బొమ్మ నాగరాజులు పాల్గొన్నారు.

సమాజాన్ని మార్చేశక్తి సాహిత్యానికుంది

ముువ్వా శ్రీనివాసరావు

ఖమ్మంసాంస్కృతికం, జనవరి28: సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానికుందని ప్రముఖ సాహితీ వేత్త మువ్వా శ్రీనివాసరావు అన్నారు. అక్షరాల తోవ సాహిత్యసంస్థ ఆరోవార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయికథలపోటీ విజేతలకు బహుమతులు అందజేశారు.ఖమ్మంలోని రిక్కాబజార్ హైస్కూల్‌లో ఆదివారం జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడారు. బహుమతి పొందిన కథలు, కవితలతో ముద్రించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కథలపోటీల విజేతలు బి. కళాగోపాల్, బీవీ శివప్రసాద్, పొత్తూరి సీతారామ రాజులతోపాటు కంచర్ల శ్రీనివాస్‌కు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో యలమద్ది వెంకటేశ్వర్లు (వైవీ), రౌతు రవి, లెనిన్ శ్రీనివాస్, ఉరిమళ్ల సునంద, సయ్యద్ షఫి, నామా పురుషోత్తం, రాచమళ్ల ఉపేందర్, దాసరోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ సాహితీవేత్త మువ్వా

రాజీవ్ గృహకల్ప ప్లాట్లను పంచాలి

తెలుగుదేశం పార్టీ డిమాండ్

ఖమ్మంరూరల్/మామిళ్లగూడెం, జనవరి28: మున్నేరు నది ఒడ్డున రాజీవ్ గృహకల్ప ఇళ్లను పేదలకు పంచాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ప్లాట్లను నిర్మించి పదిసంవత్సరాలుగా ప్రజలకు పంచకుండా ఖాళీగా ఉంచటాన్ని తప్పు పట్టింది. జిల్లాలో ఎంతోమంది నిరుపేదలు అర్హులైన పేదలు ఉన్నారని వారికి వీటిని ఉచితంగా పంచాలని డిమాండ్ చేశారు. శిథిలావస్తుకు చేరుతున్న ఇంటినిర్మాణాలను ఆదివారం తెలుగు దేశం పార్టీనాయకులు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీజిల్లా ఉపాధ్యక్షుడు కొండ బాల కరుణాకర్,లీగల్ సెల్‌రాష్ట్రప్రధాన కార్యదర్శి మల్లెం పాటి అప్పారావు, గడిపూడి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ చావా రామారావు, నాయకులు, పాలడుగు క్రిష్ణప్రసాద్, పద్మ నాబుల నారాయణరావు, కర్లాటి అశ్వనీకుమార్ చావా అజయ్, దొడ్డా క్రిష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గృహకల్ప ప్లాట్లను పరిశీలిస్తున్న నాయకులు

మిత్రురాలి వైద్య ఖర్చులకు సాయం

సత్తుపల్లిరూరల్, జనవరి28: తమతో పాటు చదువుకున్న తోటిమిత్రురాలు క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకున్నారు. ఆమెకు ఎంతోకొంత సాయం అందిద్దామనే ఉద్దేశ్యంతో సేకరించిన రూ.50వేలను చికిత్స నిమిత్తం అందజేశారు. సత్తుపల్లి మండలంలోని గంగారం ప్రభుత్వ పాఠశాలలో 1986-87లో పదవ తరగతి చదివిన పిల్లి సలోమి ఇటీవల క్యాన్సర్ బారినపడ్డారు. విషయం తెలుసుకున్న అప్పటి మిత్రులు ఆమెను ఆదుకునేందుకు రూ.50వేల నగదును సేకరించారు. ఆమెను పరామర్శించి అందజేశారు. భవిష్యత్‌లో కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వపు మిత్రులు కొండపల్లి కొండలరావు, లక్ష్మణ్‌సింగ్, పున్నం రామమూర్తి, సోయం నాగేశ్వరరావు, సోయం వెంకటేశ్వరరావు, డీ.రామకృష్ణ, తన్నీరు శ్రీనివాసరావు, జంగాల నాగభూషణం, డీవీఎస్ఎన్.రెడ్డి, ఎండీ.ఆరీఫ్ పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న మిత్రులు

ఎంపీ ఎన్నికల్లో సత్తా చూపిస్తాం

వైరా,జనవరి28: త్వరలో జరిగే లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాపిస్తామని వైరా మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ పేర్కొన్నారు. వచ్చేనెల నాల్గోతేదీన వైరాలో ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ సమావేశం వైరాలో జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఆదివారం వైరాలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతామని, వైరా నియోజకవర్గంలో ఖమ్మం ఎంపీ అభ్యర్థికి మెజార్టీ ఓట్లు సాధించి నష్టాన్ని పూడ్చుతామని స్పష్టం చేశారు. తాతా మధుసూదన్, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొంటారని, సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న మదన్‌లాల్